విశాఖపట్టణం
గురువారం 1 అక్టోబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 230 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## హైపవర్ కమిటీ నియామకం

జర్నలిస్టులపై దాడుల కేసుల పరిశీలన

సంబంధిత వర్గాల నుంచి వివరాల సేకరణ

కమిటీకి కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు




2

# ఏసీ బస్సుల్లోనూ ఫ్రీ జర్నీ

## మహిళలకు కూటమి సర్కార్ మరో కానుక

### కొత్త బస్సులు కొనుగోలు తర్వాత అమలు... సీఎం చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన






(విజయవాడ - జయజయహే)

ప్రస్తుతం ఏపీలో స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే అమలు చేస్తున్నారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఏసీ, నాన్ ఏసీ స్లీపర్ బస్సులు, తిరుమల-తిరుపతి మధ్య నడిచే సప్తగిరి బస్సులు, నాన్ స్టాప్, అంతరాష్ట్ర బస్సుల్లో స్త్రీశక్తి పథకం వర్తించపచేయడం లేదు. ఈ క్రమంలో తాజాగా సీఎం చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంపై కీలక ప్రకటన చేశారు. ఏసీ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. మహిళల ..మిగతా 2లో



## కనీస మద్దతు ధర పెంపు

రబీ సీజన్ 2027-28కి నిర్ణయాలు

పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలకు ప్రాధాన్యం

పీఎం ధార పేరిట ఇందుకోసం ప్రత్యేక స్కీమ్

కేంద్ర కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా రబీ పంటలకు సంబంధించి 2027-28 సీజన్‌కు మద్దతు ధరను నిర్ణయించింది. గోధుమలు, బార్లీ (జౌ), శనగలు, ఆవాలు, పొద్దుతిరుగుడు (కుసుమ), మసూర్ (కందులు/చిరుధాన్యాల రకం) పంటల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గోధుమలపై క్వింటాలుకు రూ.25 పెంచారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరలో అత్యధికంగా కుసుమ పంటకు క్వింటాలుకు ₹675 చొప్పున పెంపుదల చేశారు. ఆ తర్వాత రేప్‌సీడ్, ఆవాలకు క్వింటాలుకు ₹413 చొప్పున పెంచారు. మసూర్ పంటకు క్వింటాలుకు ₹390, బార్లీకి (జౌ) క్వింటాలుకు ₹136, శనగలకు ..మిగతా 2లో

# బాణాసంచాను పూర్తిగా నిషేధించలేం

పర్యావరణ పరిరక్షణ పాటించాలి

ప్రజల భావోద్వేగాల సమతుల్యత అవసరం

జాయింట్ క్రాకర్స్ కు పచ్చజెండా

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశవ్యాప్తంగా బాణసంచాపై సంపూర్ణ నిషేధం విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణ, ప్రజల భావోద్వేగాల మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. నిబంధనలకు లోబడి పనిచేసే కొత్త తరం 'జాయింట్ గ్రీన్ క్రాకర్స్' (లడీలు) తయారీ, విక్రయాలకు అనుమతినిస్తూనే, బేరియం రసాయనంతో కూడిన గ్రీన్ క్రాకర్ల ప్రభావంపై తుది అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి, నిపుణుల కమిటీకి అక్టోబర్ 15 వరకు సమయం ఇచ్చింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

**సంపూర్ణ నిషేధం కుదరదు**

పరిమితులు లేని బాణసంచా కాల్చివేతను లేదా సంపూర్ణ నిషేధాన్ని తాము సమర్థించబోమని ధర్మాసనం తెలిపింది. "మనం సంపూర్ణ నిషేధాన్ని అనుమతించం, అలాగని 24 గంటల పాటు బాణసంచా కాల్చడానికీ సమ్మతించం. సంపూర్ణ నిషేధం విధిస్తే ప్రజల భావోద్వేగాలు దెబ్బతింటాయి. అదే సమయంలో 24 గంటలు అనుమతిస్తే వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతుంది" అని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాలుష్యం తగ్గించేందుకు, ..మిగతా 2లో





## కమ్మ, క్రిస్టియన్లే పాలిస్తున్నారు

మమ్మల్ని గెలిపిస్తే బీసీలకు సీఎం పదవి

జగన్ వద్ద సజ్జలే నన్ను బ్యాడ్ చేసారు

రాజధానిపై వైసీపీ మోసం చేసింది

ఉత్తరాంధ్ర హక్కులపై పోరాటం

పాదయాత్ర చేసి సమస్యలపై అధ్యయనం చేస్తా

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు

2



## ఫార్మ్ 6 ఉపసంహరణ

ఎస్ ఐ ఆర్ ముగిసిన ప్రాంతాల్లో అమలు

తల్లితండ్రులు, తాతాల పేర్లు అవసరం లేదు

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఓటర్లకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం తీసుకుంది. సర్ ప్రక్రియ ముగిసిన ప్రాంతాల్లో ఫారం-6 ఆన్‌లైన్ దరఖాస్తుల నుంచి 'ఎస్ ఐ ఆర్ డిక్లరేషన్'ను ఉపసంహరించుకుంది. ఇప్పటికే సర్ ప్రక్రియ పూర్తైన రాష్ట్రాల్లో ఓటర్లుగా తమ పేరును కొత్తగా నమోదు చేసుకోదలిచిన వారు సాధారణ ఫారం-6ను సమర్పించాలని ..మిగతా 2లో

## దక్షిణాదికి ఎల్ నినో గండం..!

వేడి సంబంధిత మరణాలు అధికం

సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య ముప్పు

దాదాపుగా 15, 800 మరణాలు నమోదుకు ఛాన్స్



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

సూపర్ ఎల్‌నినో ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడే అవకాశం ఉందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ విడుదల చేసిన '451,000ఎట్ రిస్క్' నివేదిక ప్రకారం.. సెప్టెంబర్ 2026 నుంచి ఫిబ్రవరి 2027 మధ్య సాధారణ సంవత్సరంతో పోలిస్తే భారత్‌లో వేడి సంబంధిత కారణాలతో అదనంగా సుమారు 15,800 మరణాలు సంభవించే ..మిగతా 2లో

## 13 శాతం లోటు వర్షపాతం

నిరాశ పరిచిన నైరుతి... 282 జిల్లాల్లో తీవ్ర కరువు

భారత వాతావరణ శాఖ ప్రకటన

2



## వివేకా హత్య కేసులో ఈడీ స్పీడ్

ఏ3 ఉమాశంకర్ రెడ్డిని విచారణ

రూ. 40 కోట్ల సుపారీపై ఆరా

మిగతా నిందితులను విచారించే అవకాశం

2

# 13 శాతం లోటు వర్షపాతం

### నిరాశ పరిచిన నైరుతి

### 282 జిల్లాల్లో తీవ్ర కరువు

### భారత వాతావరణ శాఖ ప్రకటన

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



భారతదేశంలో నైరుతి రుతుపవనాల కాలం (జూన్-సెప్టెంబర్) అధికారికంగా ముగిసింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం 2026 వర్షాకాలం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అత్యంత నిరాశాజనకంగా ముగిసింది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఈసారి వర్షాకాలంలో ఏకంగా 13 శాతం లోటు నమోదైంది. దేశంలో మొత్తం మీద చూస్తే సగటున 87 శాతం మాత్రమే వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఇక ఇది 2001 సంవత్సరం తర్వాత భారతదేశంలో వర్షాకాలంలో నమోదైన నాలుగో అత్యల్ప వర్షపాతంగా నిలిచింది. లాంగ్ పీరియడ్ యావరేజ్ ( - దీర్ఘ కాలం సగటు) ఆధారంగా 1971-2000 మధ్య కాలంలో సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది గణనీయంగా తగ్గుదల నమోదైంది. 'పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో వాతావరణ పరిస్థితులు దేశవ్యాప్తంగా వర్షపాతాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ పరిస్థితి అక్టోబర్- డిసెంబర్ కాలంలో కూడా 100 శాతం కొనసాగే అవకాశం ఉంది. ఇంకా ఇది 2027 మార్చి వరకు ముగిసే సూచనలు కనిపించడం లేదు' అని భారత వాతావరణ శాఖ ప్రకటన వెలువరించింది.

**282 జిల్లాల్లో కరువు ఛాయలు**

దేశంలోని అన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు ఒకేలా లేవు. ఇక్కడ ఈసారి తీవ్ర అసమాన పరిస్థితులు కనిపించాయి. దేశవ్యాప్తంగా మొత్తం జిల్లాల్లో 38 శాతం అంటే ఏకంగా 282 జిల్లాలు తీవ్ర వర్షపాత లోటును ఎదుర్కొన్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొన్ని రోజుల వ్యవధిలో కూడా భారీ వ్యత్యాసాలు కనిపించాయి. జులై 8తో ముగిసిన వారంలో సాధారణం కంటే 45.4 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, ఆ మరుసటి వారమే ఏకంగా 51.1 శాతం లోటు కనిపించింది. ఇక్కడ వారంలోనే పరిస్థితులు తలకిందులయ్యాయన్నమాట. ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు దాదాపుగా ముఖం చాటేశాయి. సెప్టెంబర్ రెండో వారంలో కూడా 36.3 శాతం లోటు వర్షపాతమే నమోదైంది. ఆఖరి వారంలో మళ్లీ అనూహ్య రీతిలో 49 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ప్రాంతాల వారీగా, నెలల వారీగా వర్షపాతంలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టమైంది.

**ఐఎండీ ముందస్తు అంచనాలు**

భారత వాతావరణ శాఖ ఈ ఏడాది ఏప్రిల్ 13న విడుదల చేసిన ముందస్తు అంచనాల నివేదికలోనే 2026 సంవత్సరంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. మే నెలాఖరు నాటికి దీనిని మరింత తగ్గించి 90 శాతానికి అంచనాల్ని సవరించింది. చివరికి సెప్టెంబర్ ముగిసే నాటికి వాస్తవంగా నమోదైన వర్షపాతం 87 శాతం వద్ద నిలిచింది. అంటే ఇక్కడ అంచనాల్ని కూడా అందుకోలేక మరింత వెనుకే నిలిచింది. ఎల్ నినో ప్రభావమే ఈ లోటుకు ప్రధాన కారణమని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దాదాపుగా ఐఎండీ అంచనా వేసిన పరిధిలోనే సగటు వర్షపాతం ఉన్నప్పటికీ, రుతుపవనాల తీవ్రత క్రమక్రమంగా మారుతూ వచ్చింది. అంటే వర్షాకాలం ప్రారంభం నుంచి ముగింపు వరకు తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనైంది.

## బాణాసంచాను పూర్తిగా నిషేధించలేం

మొదటి పేజీ తరువాయి...

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా బాణసంచాను పూర్తిగా నిషేధించాలని కోరుతూ అర్జున్ గోపాల్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు 2015లో వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**కొత్త తరం జాయింట్ క్రాకర్స్‌కు పచ్చజెండా**

సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్-నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-నీరి), పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్ఓ), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) నిపుణుల సలహాల మేరకు కేంద్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికను ధర్మాసనం ఆమోదించింది. నిబంధనలకు లోబడి నిర్దిష్ట కొత్త తరం జాయింట్ క్రాకర్లను (లడీలు) ఉపయోగించవచ్చని కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) ఐశ్వర్య భాటి కోర్టుకు వివరించారు. సాధారణ బాణసంచా 140 నుంచి 160 డెసిబెల్ల శబ్దాన్ని చేస్తుండగా, ఈ కొత్త తరం లడీలు 125 డెసిబెల్ల కంటే తక్కువ శబ్దానికే పరిమితమవుతాయని, వీటిలో బేరియం రసాయనం వాడటం లేదని స్పష్టం చేశారు. తయారీదారులు బాణసంచా షెల్ సంఖ్య, పరిమాణం, పేలుళ్ల మధ్య సమయం వంటి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నిపుణులు షరతులు విధించారు.

**బేరియం అంశంపై అక్టోబర్ 15 వరకు గడువు**

బేరియం రసాయనం కలిగిన గ్రీన్ క్రాకర్ల అంశంపై తుది నిర్ణయం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. బహిరంగ ప్రదేశాల్లో పరీక్షలు నిర్వహిస్తేనే పరిసరాల గాలి నాణ్యతపై బేరియం ప్రభావం స్పష్టంగా తెలుస్తుందని ఏఎస్జీ ఐశ్వర్య భాటి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర అంచనా పూర్తి చేసేందుకు కేంద్రానికి, నిపుణుల బృందానికి అక్టోబర్ 15 వరకు సమయం లభించింది. పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ పూజా ధర్ స్పందిస్తూ.. గతంలో బేరియం కలిగిన బాణసంచాపై కోర్టు స్పష్టమైన నిషేధం విధించిందని గుర్తుచేశారు. సీఎస్ఐఆర్-నీరి అధ్యయనాల ఆధారంగా బేరియం రసాయనం శ్వాసకోశ ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని 2018లో సుప్రీంకోర్టు ఈ నిషేధాన్ని అమలు చేసింది. సెప్టెంబర్ 2న జరిగిన విచారణలో, పర్యావరణ విషయాల్లో నిపుణుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్న ధర్మాసనం, కొత్త తరం గ్రీన్ క్రాకర్లకు ఇచ్చిన మినహాయింపులపై నిబంధనలు ఖరారు చేయడానికి కేంద్రానికి మూడు వారాల సమయం ఇచ్చింది. నీరి నిర్వహించిన ల్యాబ్ పరీక్షల్లో బేరియం ఉన్న కొత్త తరం గ్రీన్ క్రాకర్ల వల్ల పీఎం10 ఉద్గారాలు 45% నుండి 60% వరకు తగ్గినట్లు తేలింది. అయితే, క్షేత్రస్థాయిలో నిజమైన ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఢిల్లీ, భోపాల్, కోల్‌కతా, చెన్నైలలో బహిరంగ పరీక్షలు నిర్వహించాలని కేంద్రం ప్రతిపాదించింది.

**ఉత్సవాల సీజన్ నేపథ్యంలో వ్యాపారుల విజ్ఞప్తి**

దసరా, దీపావళి పండగలు దగ్గరపడుతున్నందున కేంద్రం ఆమోదించిన ఫార్ములాల ఆధారంగా తయారీ, పంపిణీ, విక్రయాలు వేగవంతం చేయాల్సి ఉందని, ఈ వ్యవహారంపై అత్యవసర ఉత్తర్వులు ఇవ్వాలని తయారీదారుల తరఫు సీనియర్ న్యాయవాదులు కే పరమేశ్వర్, ప్రణవ్ సచ్‌దేవా కోర్టును కోరారు. ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతంలో బాణసంచా నిబంధనలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వద్ద ఉన్న కేసుతో ఈ వ్యవహారం ముడిపడి ఉంది. రెండు పిటిషన్లలో అంశాలు ఒకేలా ఉన్నందున, ఉమ్మడి విచారణ కోసం సీజేఐని సంప్రదించేందుకు ధర్మాసనం అనుమతించింది. గత ఏడాది అక్టోబర్‌లో అప్పటి సీజేఐ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఏప్రిల్ 3, 2025 నాటి నిషేధ ఉత్తర్వులను సవరిస్తూ, దీపావళి సమయంలో అక్టోబర్ 18 నుండి 20 వరకు నిర్దిష్ట సమయాల్లో బాణసంచా విక్రయాలు, కాల్చడానికి పరిమిత అనుమతి ఇచ్చింది.

## వివేకా హత్య కేసులో ఈడీ స్పీడ్

(హైదరాబాద్ - జయజయహే)

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఈ క్రమంలోనే ఇవాళ రెండో రోజు ఏ3 ఉమాశంకర్‌రెడ్డిని 9 గంటల పాటు అధికారుల విచారించారు. హత్య కేసులో రూ.40 కోట్ల సుపారీపై ఆరా తీశారు. ఆ డబ్బును ఎర్రగంగిరెడ్డి నిందితులకు సర్దుబాటు చేసినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో మిగతా నిందితులనూ విచారించే అవకాశం ఉంది. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే దస్తగిరి, సునీల్‌యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారించింది. దస్తగిరి, సునీల్‌యాదవ్ స్టేట్‌మెంట్ల ఆధారంగా ఏ1 ఎర్ర గంగిరెడ్డిని రెండ్రోజులపాటు అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వివేకా హత్య కోసం రూ.40 కోట్లు సుపారీ చెల్లించేలా ఒప్పందం చేసుకుని నిందితుడు షేక్ దస్తగిరి (అప్రూవర్‌గా మారారు)కి అడ్వాన్స్ కింద రూ. కోటి ఇచ్చారంటూ సీబీఐ తేల్చింది. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి సారించింది. దీని వెనక పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఇటీవల హైదరాబాద్‌తోపాటు వైఎస్సార్ కడప జిల్లాలోని నిందితుల నివాసాల్లో మొత్తం 7 చోట్ల ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి సంబంధించి హైదరాబాద్ కోకాపేట గోల్డెన్‌మైన్ రోడ్డులోని ఓపెన్‌స్కై స్పేస్ అపార్ట్‌మెంట్‌లోని నివాసంలోనూ, పులివెందులలోని ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. పులివెందులలో అవినాశ్‌రెడ్డి ప్రధాన అనుచరుడు దేవిరెడ్డి శివశంకరరెడ్డి, యాదటి సునీల్ యాదవ్, షేక్ దస్తగిరి, తొండూరు మండలం టి.తుమ్మలపల్లెలో ఎర్ర గంగిరెడ్డి నివాసాల్లోనూ తనిఖీలు జరిపారు. అవినాశ్‌రెడ్డి నివాసం నుంచి లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదు, 2 బ్యాంకు లాకర్ల తాళాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నివాసాల నుంచి పలు కీలకపత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.



## ఏసీ బస్సుల్లోనూ ఫ్రీ జర్నీ

మొదటి పేజీ తరువాయి...

కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. విజయవాడలో బుధవారం జరిగిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 26,400 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీశక్తి స్కీమ్ ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, భవిష్యత్తులో ఏసీ బస్సులు కూడా కొంటామని స్పష్టం చేశారు. మొన్న విశాఖలో, ఆ తర్వాత మంగళగిరిలో పేదలకు ఇళ్ల పట్టాలు అందించామని, ఇవాళ విజయవాడలో పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఇప్పటివరకు 60 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఆస్తులను పేదలు అమ్ముకోవద్దని సూచించిన చంద్రబాబు,, భవిష్యత్ కోసం ఉంచుకోవాలని తెలిపారు. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ జెడ్ స్పీడ్‌తో దూసుకెళ్తుందని చంద్రబాబు అన్నారు. గత పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని కోరారు. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాయని, ఏళ్ల తరబడి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తామని అన్నారు. గత ప్రభుత్వం ప్రజల భవిష్యత్తులో ఆటలాడుకుందని, భూసర్వే పేరుతో ప్రతీ గ్రామంలో వివాదాలు సృష్టించిందన్నారు. ప్రజల ఆస్తులు, పాస్‌బుక్‌లపై వారి ఫొటోలు వేసుకున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌లు అందిస్తున్నట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. కాగా ఏసీ బస్సుల్లో కూడా త్వరలో మహిళలకు ఫ్రీ జర్నీ కల్పిస్తామని చంద్రబాబు ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. కొత్త ఏసీ బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వీటిని కొనుగోలు చేసిన తర్వాత ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారని తెలుస్తోంది.

## ఫార్మ్ 6 ఉపసంహరణ

మొదటి పేజీ తరువాయి...

ఈసీ పేర్కొంది. మునుపటి సర్ ప్రక్రియలోని తల్లిదండ్రులు, తాతల వివరాలను సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో, తల్లిదండ్రుల పాత డేటాతో సంబంధం లేకుండా ఇకపై కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం యువతకు లభించింది. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కొనసాగుతున్న ప్రాంతాల్లో మాత్రం కొత్తగా పేర్ల నమోదు కోసం యువ ఓటర్లు తమ తల్లిదండ్రులకు సంబంధించి మునుపటి సర్ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే, అదనపు డిక్లరేషన్‌గా మాత్రమే యువ ఓటర్లు ఈ వివరాలను ఇవ్వాల్సి ఉంటుందని ఈసీ స్పష్టత ఇచ్చింది. సర్ ప్రక్రియలో ఓటుకు దూరమైన వారు కూడా ఇదే అదనపు వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. ఫారం-6 లో ఎలాంటి మార్పులు చేయలేదని వివరించింది.

**అసలేమిటీ వివాదం**

ఫారం-6లో మార్పుల విషయంలో ఎన్నికల కమిషనర్ల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. ఫారం-6 ద్వారా కొత్తగా ఓటర్లుగా నమోదు కాదలిచిన వారు మునుపటి సర్ ప్రక్రియలోని తమ తల్లిదండ్రుల వివరాలను కూడా జత చేయాలని ఈసీ కోరడంపై ఎన్నికల కమిషనర్లు సంధూ, జోషి అభ్యంతరాలు చెప్పినట్టు తెలిసింది. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960కి మార్పులు చేయకుండా ఫారం-6లోమార్పులు సాధ్యం కాదని ఈసీలు పేర్కొన్నట్టు సమాచారం. అయితే, ఫారం-6లో కొత్తగా ఎలాంటి మార్పులు చేయలేదని ఈసీ ఆ తరువాత ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. అదనపు డిక్లరేషన్‌గా మాత్రమే సర్ వివరాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పినట్టు పేర్కొంది. ఏకాభిప్రాయంతోనే ఈ నిబంధన రూపొందించినట్టు తెలిపింది. సర్ ప్రక్రియ ముగిసిన ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ కూడా అవసరం లేదని తాజాగా తెలిపింది.



## దక్షిణాదికి ఎల్ నినో గండం..!

మొదటి పేజీ తరువాయి...

అవకాశం ఉంది. ఇది వాస్తవ మరణాల లెక్క కాదు.. వాతావరణం, ఉష్ణోగ్రతలు, స్థానిక పరిస్థితులు, గతంలో ఉష్ణోగ్రతలకు సంబంధించిన మరణాల నమూనాల ఆధారంగా రూపొందించిన అంచనా. నివేదిక ప్రకారం భారత్‌లోనే అత్యధిక ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై కనిపించే అవకాశం ఉంది. మహారాష్ట్రలో 2,640 అదనపు మరణాలు అంచనా వేయగా.. కర్ణాటక 1,870తో దేశంలో రెండో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్, కేరళలో చెరో 1,680, తమిళనాడులో 1,640, తెలంగాణలో 1,122 అదనపు వేడి సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉందని నివేదిక గణాంకాలు సూచిస్తున్నాయి. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఐదు దక్షిణ రాష్ట్రాల్లో కలిపి 7,992 మరణాలు అంచనా వేయశారు. అంటే దేశవ్యాప్తంగా అంచనా వేసిన సంఖ్యలో దాదాపు సగం దక్షిణ భారతంలోనే ఉండొచ్చన్నమాట..!

**ఫిబ్రవరిలో ముప్పు మరింత పెరిగే అవకాశం**

నివేదికలోని అంచనాల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో వేడి సంబంధిత మరణాలు సెప్టెంబర్, అక్టోబర్‌లో అధికంగా ఉండి.. నవంబర్, డిసెంబర్‌లో కొంత తగ్గిన తర్వాత జనవరి, ఫిబ్రవరిలో మళ్లీ పెరిగే అవకాశం ఉంది. అయితే ప్రస్తుత ఆరు నెలల అంచనా ముగిసిన తర్వాత కూడా భారత్‌లో, ముఖ్యంగా ఉత్తరార్ధగోళ వేసవి సమయంలో వేడి సంబంధిత మరణాలు పెరిగే అవకాశం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతల్లో అసాధారణ పెరుగుదలతో ఏర్పడే ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నమూనాలను ప్రభావితం చేస్తుంది. ప్రస్తుత ఎల్‌నినో జూన్ 2026లో ప్రారంభమై ఉత్తరార్ధగోళ వసంతకాలం వరకు కొనసాగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. రాబోయే నెలల్లో ప్రపంచ భూభాగ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి సుమారు 1.2సెల్సియస్ అధికంగా ఉండొచ్చని, అత్యంత వేడి రోజులు సాధారణ సంవత్సరంతో పోలిస్తే 44 శాతం అధికంగా ఉండవచ్చని అంచనా వేసింది. క్లైమేట్ ఇంపాక్ట్ లెక్కల ప్రకారం.. ఎల్‌నినో ప్రారంభమైన జూన్ 2026 నుంచి ఫిబ్రవరి 2027 వరకు తొమ్మిది నెలల్లో ప్రపంచవ్యాప్తంగా సాధారణ సంవత్సరంతో పోలిస్తే సుమారు 4,51,000 అదనపు వేడి సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఇందులో వచ్చే ఆరు నెలలకు సంబంధించిన అంచనా 2,39,000 గా ఉంది. తెలంగాణలో 1,122 అదనపు వేడి సంబంధిత మరణాల అంచనా నమోదవడం రాష్ట్రానికి కూడా ముప్పు ఉందనే విషయాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో ఉన్నవారు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, తగిన శీతలీకరణ సదుపాయాలు లేని ప్రజలు తీవ్ర వేడికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముందస్తు వేడి హెచ్చరిక వ్యవస్థలు, బలహీన వర్గాలకు లక్షిత ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, తాగునీటి కేంద్రాలు, కూలింగ్ సెంటర్లు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు రక్షణ చర్యలు, ఆసుపత్రుల్లో అత్యవసర సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలు ఉపయోగపడతాయని క్లైమాట్ ఇంపాక్ట్ ల్యాబ్ సూచించింది. పరిశోధకుల దృష్టిలో ఈ నివేదిక కేవలం ప్రస్తుత ఎల్‌నినో ప్రమాదాన్ని చూపించడమే కాదు.. భవిష్యత్తులో వాతావరణ మార్పులతో సాధారణంగా మారే అధిక ఉష్ణోగ్రత పరిస్థితులకు ముందస్తు హెచ్చరికగా కూడా పనిచేస్తోంది. అందుకే అత్యవసర చర్యలతో పాటు దీర్ఘకాలికంగా వేడి నుంచి ప్రజలను రక్షించే మౌలిక సదుపాయాలు, ఆరోగ్య వ్యవస్థలు, ముందస్తు ప్రణాళికలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నివేదిక సూచిస్తోంది.

## కనీస మద్దతు ధర పెంపు

మొదటి పేజీ తరువాయి...

క్వింటాలుకు ₹83, గోధుమలకు క్వింటాలుకు 25 చొప్పున పెంచారు. ఢిల్లీ ట్రాఫిక్ నిర్వహణను మెరుగు చేయడం కోసం 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' తీసుకురావాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 1,529 ట్రాఫిక్ సిగ్నల్స్ స్థిరమైన మ్యాన్యువల్ పద్ధతిలో ఉన్నాయి. అయితే ఐటీఎంఎస్ తర్వాత ఈ సిగ్నల్స్ ట్రాఫిక్ రద్దీకి తగ్గట్లుగా సిగ్నల్ సమయాన్ని అవే అడ్జస్ట్ చేసుకుంటాయి. దీనిని మూడు విడతలలో (ఫేజ్‌లలో) అమలు చేయనున్నామని తెలిపారు. వేర్వేరు కారిడార్లలో వేర్వేరు సమయాల్లో ఈ పద్ధతిని అమలు చేస్తారు. ఇందుకోసం కేంద్రం 1,790 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌తో కలిపి రెన్యూవబుల్ ఎనర్జీ సరఫరా చేయడం కోసం 1.86 లక్షల కోట్ల అంచనాతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ ×××' పథకానికి కూడా మోదీ కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'పీఎం ధార' పథకాన్ని తీసుకొచ్చింది. రూ. 1,86,405 కోట్లను ఈ పథకానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

**నిర్ణయించిన కనీస మద్దతు ధరల వివరాలు**

గోధుమలు: క్వింటాలుకు ₹2,610
శనగలు: క్వింటాలుకు ₹5,928
బార్లీ (జౌ): క్వింటాలుకు ₹2,286
మసూర్: క్వింటాలుకు ₹7,390
ఆవాలు: క్వింటాలుకు ₹6,613
పొద్దుతిరుగుడు క్వింటాలుకు: ₹7,215

## హైపవర్ కమిటీ నియామకం

(అమరావతి - జయజయహే)

పాత్రికేయులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ తరహా కేసులను పరిశీలించేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్మన్‌గా రాష్ట్ర హోంమంత్రి, వైస్ ఛైర్మన్‌గా సమాచార పౌర సంబంధాల శాఖ(ఐ అండ్ పీఆర్) మంత్రిని నియమించింది. హోంశాఖ, సాధారణ పరిపాలన శాఖ, ఐ అండ్ పీఆర్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులను కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించింది. లా అండ్ ఆర్డర్ విభాగానికి చెందిన ఐజీ కూడా ఇందులో సభ్యుడిగా ఉంటారు. గుర్తింపు పొందిన మూడు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులకు కూడా కమిటీలో సభ్యత్వం కల్పించారు. వీరితో పాటు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులూ ఇందులో చోటు దక్కించుకున్నారు. ఈ కమిటీకి ఐ అండ్ పీఆర్ డైరెక్టర్.. కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అయితే.. అవసరానికి అనుగుణంగా కమిటీలో అదనపు సభ్యుడినీ కోఆప్ట్ చేసుకునే వెసులుబాటు కూడా ప్రభుత్వం కల్పించింది. ఈ కమిటీ జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలకు సంబంధించిన కేసులను పరిశీలించడం సహా ఆయా అంశాలపై సంబంధిత వర్గాల నుంచి వివరాలను సేకరించనుంది.

# మైనారిటీల కోసం "రిఫార్మ్ ఉత్సవ్"

## భారీగా తరలిరావాలని పిలుపునిచ్చిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి,సెప్టెంబరు 30 (జయ జయహే )**

కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అనుబంధమైన 'నేషనల్ మైనారిటీస్ డెవలప్మెంట్ & ఫైనాన్స్ కార్పొరేషన్' (ఎన్ ఎం డి ఎఫ్ సి ) ఆధ్వర్యంలో అక్టోబర్ 8న మైనారిటీల కోసం "రిఫార్మ్ ఉత్సవ్"భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.తొలిసారిగా విజయవాడలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక "రిఫార్మ్ ఉత్సవ్" నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. మైనారిటీ వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నతమైన ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలను, తక్కువ వడ్డీతో కూడిన రాయితీ రుణాలను అందిస్తున్నాయని తెలిపారు.అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సరైన సమాచారం లేకపోవడం, అవగాహన లేకపోవడం వల్ల చాలామంది ఈ అవకాశాలను అందుకోలేకపోతున్నారన్నారు.ఈ లోటును భర్తీ చేయడమే లక్ష్యంగా 'రిఫార్మ్ ఉత్సవ్' నిర్వహించడం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఇందులో భాగంగా మైనారిటీ మహిళల ఆర్థికాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు, విద్యార్థుల ఉన్నత చదువులకు లభించే వివిధ ప్రభుత్వ రుణాలు, శిక్షణా కార్యక్రమాలపై ఎన్ ఎం డి ఎఫ్ సి తరఫున జాతీయ స్థాయి అధికారులు నేరుగా అవగాహన కల్పిస్తారని తెలిపారు. లబ్ధిదారులకు, ప్రభుత్వానికి మధ్య ఇదొక వారధిలా పనిచేస్తుందన్నారు. విజయవాడలో అంబేద్కర్ కళా వేదికలో జరగబోయే ఈ మెగా అవగాహన సదస్సుకు



రాష్ట్రంలోని మైనారిటీ సోదర సోదరీమణులు, నిరుద్యోగ యువతీ యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు అందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని మైనారిటీలందరూ సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, హాజరయ్యే ప్రతినిధులకు,ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని మైనారిటీ సంక్షేమ కార్యదర్శిని మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు.



### అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో

# పోటీ పరీక్షలకు ఈ బుక్స్

**ప్రారంభించిన ప్రొఫెసర్ సూర్య నారాయణ**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 30, జయ జయహే**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఈ-బుక్స్‌తో పాటు రూ.50 వేల విలువైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూప్స్, యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్, ఆర్ఆర్బీ, డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను బుధవారం ప్రారంభించారు. రిటైర్డ్ ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సీహెచ్ సూర్యనారాయణ, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుస్తకాలను ప్రొఫెసర్ సీహెచ్ సూర్యనారాయణ బహూకరించారు.కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం చైర్మన్ గారా సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కాంతారావు, శంకరరావు, సరస్వతి, విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ కోలా హరిబాబు, దళిత సంఘాల నాయకులు చింతాడ సూర్యం, ఇంటి గురుమూర్తి, ఆంధ్ర విశ్వవిద్యాలయ లైబ్రేరియన్ సంజీవరావు, విజ్ఞాన కేంద్రం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## కుసుమ సాగుపై రైతులకు అవగాహన

**కొయ్యురు :(జయ జయహే ) న్యూస్ అక్టోబర్ 01,**

అల్లూరి జిల్లా కొయ్యురు మండలం శరబన్నపాలెం రైతు సేవా కేంద్రం, నందు మంగళవారం రైతులకు కుసుమ పంట సాగుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి.శివరామప్రసాద్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో మండలానికి 50 ఎకరాలకు కుసుమ విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. కుసుమ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభం పొందవచ్చని, ఆరుతడి పంటలకు ఇది ప్రత్యామ్నాయమని రైతులకు వివరించారు. వీడియో ప్రదర్శన ద్వారా సాగు విధానం, యాజమాన్య పద్ధతులను తెలియజేశారు.ఆసక్తి గల రైతులు తమ పేర్లను సమీప రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని, అలాగే వేరుశనగ, మినుము విత్తనాలు కావాల్సిన రైతులు కూడా వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు లోవ లక్ష్మి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నారాయణమూర్తి, రైతులు మహేష్, త్రిమూర్తులు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోండి..

**కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రరావు**

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్) అక్టోబర్ 01,**

తల్లీబిడ్డల ఆరోగ్యానికి సంపూర్ణ పౌష్టికాహారమే శ్రేయస్కరమని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిబోయిన చక్రరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి అన్నారు.మండలంలోని చింతలపూడి సెక్టార్ పరిధి మర్రివాడ అంగన్‌వాడీ కేంద్రంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీల ద్వారా అందుతున్న సేవలను, సరుకుల నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా చక్రరావు మాట్లాడుతూ.. రసాయన పంటలకు బదులు సేంద్రీయ ఉత్పత్తులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, మునగాకు పొడి వాడాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు (నాని), జిల్లా ఉపాధ్యక్షురాలు ఉష, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు దేవుడు, ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గర్భిణికి ఘనంగా సీమంతం నిర్వహించి, కార్యకర్తలను శాలువాలతో సత్కరించారు.



### అంగన్వాడీ సిబ్బందికి

# సేవా సంకల్ప అభియాన్

**ఆనందపురం, సెప్టెంబర్ 30, జయ జయహే**

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా విశాఖపట్నం జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొట్నూరు వెంకట కృష్ణారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.ఎం.ఎన్. పరశురామరాజు మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా పాలు, గుడ్లు, విటమిన్ పౌడర్‌తో పాటు ఇతర పోషక పదార్థాలను అందిస్తోందన్నారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా చిన్నారుల ఆరోగ్యం, పోషణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొట్నూరు వెంకట కృష్ణారావు మాట్లాడుతూ అంగన్వాడీల సంక్షేమం కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సక్రమంగా వినియోగించేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. చిన్నారులకు మెరుగైన పోషకాహారం అందించడంలో అంగన్వాడీ సిబ్బంది పాత్ర కీలకమని అన్నారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన అంగన్వాడీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి జీరు కైలాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధాణేష్, జిల్లా కిసాన్ మోర్చా మహిళా అధ్యక్షురాలు నాదెండ్ల జ్యోతి, జిల్లా బీజేపీ మహిళా కార్యదర్శి సునీత, ఆనందపురం మండల బీజేపీ అధ్యక్షురాలు పిల్లా విజయ, పద్మనాభం మండల బీజేపీ అధ్యక్షురాలు తమటపు నాగమణి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి డి.పి.జె. రాజు, భీమిలి నియోజకవర్గ ఐసీడీఎస్ పీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




# గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం.. నిధులు అర్హులందరికీ అందాలి

**అరకు ఎంపీ డాక్టర్ జి. తనూజా రాణి**

**సంక్షేమ పథకాలపై ఎంపీ, కలెక్టర్ సుదీర్ఘ చర్చ**

**పార్వతీపురం మన్యం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ తనూజా రాణి పిలుపునిచ్చారు. బుధవారం పార్వతీపురం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'దిశా' (జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ) సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా ఎన్. ప్రభాకర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్ వైశాలి తో కలిసి ఎంపీ వివిధ శాఖల ప్రగతిపై సుదీర్ఘ సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేస్తూ మౌలిక వసతులు, ఉపాధి హామీ పనులు, తాగునీరు, రోడ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అధికారులు బాగానే పనిచేస్తున్నప్పటికీ, నిర్దేశించుకున్న లక్ష్యాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రతీ సమీక్షా సమావేశానికి స్పష్టమైన పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు. దిశా సమావేశం అనేది ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించే వేదిక అని స్పష్టం చేస్తూ, అధికారులు రాష్ట్ర పథకాల సమాచారంతో పాటు కేంద్ర పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయో, వాటి అమలులో ఏవైనా మార్పులు లేదా మెరుగైన సూచనలు ఉంటే చర్చించాలని సూచించారు. అలాగే, పార్లమెంట్ నిధుల కింద మంజూరైన పనుల పురోగతిపై సమీక్షిస్తూ, గతంలో రద్దయిన లేదా పెండింగ్‌లో ఉన్న పనుల నిధులను ఇతర పనులకు కేటాయించే అవకాశాలను పరిశీలించి నివేదికలు అందించాలని కోరారు. జిల్లా అభివృద్ధికై కలెక్టర్ నేతృత్వంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి పనిచేస్తున్నారని అభినందిస్తూ, తమ నియోజకవర్గ పరిధిలోని పనులను ఎక్కడా నిలిపివేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సుదీర్ఘ సమయం పాటు ఎంతో ఓపికగా సమావేశంలో పాల్గొని ప్రసంగించిన అధికారులందరికీ ఎంపీ తనూజారాణి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలి

**పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి**

**పార్వతీపురం మన్యం జయజయహే**

క్షేత్ర స్థాయిలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ముందస్తు సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా బలిజిపేట పోలీస్ స్టేషన్ని సందర్శించారు. పార్వతీపురం రూరల్ సర్కిల్ సిఐ రంఘనాథం, ఎస్సై రాజేష్ పూలమొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు. సిబ్బంది నుండి జిల్లా గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ యొక్క పరిసర ప్రాంతాలను, పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలలో పచ్చదనానికి ప్రతీకగా మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉ ంచుకోవాలని సూచించారు.పెండింగ్ లో ఉన్న కేసులను మరియు క్రైమ్ రికార్డులను స్టేషన్ లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్ట్ కు సంబంధించిన రికార్డ్స్ మరియు ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసులలో దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతి గూర్చి ఆరా తీసి, సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధి విధానాలపై దిశానిర్దేశం చేసారు . స్టేషనులో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నది, వారు ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండేలా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి వాహనతనిఖీలు నిర్వహించాలని,గంజాయి అక్రమ రవాణా చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు . ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని స్థాయిలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ముందస్తు సమాచారం లభ్యమయ్యే విధంగా సమాచార వ్యవస్థను మెరుగుకోవాలన్నారు. సమస్యలు సృష్టించే వారిపై, చెడునడత వారిపై ద్రుష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లిపార్వతీపురం రూరల్ సర్కిల్ సిఐ రంఘనాథం, ఎస్సై రాజేష్, సిసి సంతోష్ మరియు సిబ్బంది పాల్గోన్నారు.

# కమ్మ, క్రిస్టియన్లే పాలిస్తున్నారు

**మమ్మల్ని గెలిపిస్తే బీసీలకు సీఎం పదవి**

**జగన్ వద్ద సజ్జలే నన్ను బ్యాడ్ చేసారు**

**రాజధానిపై వైసీపీ మోసం చేసింది**

**ఉత్తరాంధ్ర హక్కులపై పోరాటం**

**పాదయాత్ర చేసి సమస్యలపై అధ్యయనం చేస్తా**

**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు**

**(విశాఖపట్నం - జయజయహే)**



విశాఖపట్నం వేదికగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కమ్మ, క్రిస్టియన్లు మాత్రమే పాలిస్తున్నారని.. బీసీ కులాల నుంచి ఎవ్వరూ సీఎం కాలేదని, మేం గెలిస్తే వెనుకబడిన కులాలకే సీఎం పదవి ఇస్తామన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాజధాని అమరావతిని తాను వ్యతిరేకించ లేదని స్పష్టం చేస్తూనే.. గత వైసీపీ పాలనను ఎండగట్టారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలది ప్రజలపై బూటకపు ప్రేమ అని, తీవ్ర సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణంలో తనకేమీ సంబంధం లేదన్నారు. దీనికి అసలు కర్త, కర్మ, క్రియ అంతా రాజ్ కేసిరెడ్డేనని స్పష్టం చేశారు. తనకు తెలిసిన వివరాలన్నీ ఇప్పటికే అధికారులకు వెల్లడించినట్లు తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి వైఖరి వల్లే పార్టీ తీవ్రంగా నష్టపోయిందని, వైఎస్ జగన్ వద్ద తనను ఒక దుర్మార్గుడిగా చిత్రీకరించింది ఆయనేనని విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**రాజధానిపై వైసీపీ మోసం చేసింది**

విశాఖపట్నాన్ని రాజధాని చేస్తామని చెప్పి, మూడు రాజధానులు అంటూ వైసీపీ మాట తప్పిందని విజయసాయిరెడ్డి అన్నారు. నాడు విశాఖను రాజధానిగా ప్రకటించిన వైఎస్ జగన్.. నేడు 'మావిగన్' అంటూ విచిత్ర వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ అభివృద్ధి విషయంలో మాట తప్పినందుకు వైసీపీ అధినేత, పార్టీ నేతలు ఉత్తరాంధ్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధానికి తాను ఎంతమాత్రం వ్యతిరేకం కాదన్న విజయసాయిరెడ్డి.. అధికారంలోకి వచ్చే వరకు వైసీపీ తనను వాడుకొని, ఆ తర్వాత 3 నెలల్లోనే పక్కన పెట్టి తనపై కుట్రలు, దుష్ప్రచారం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉత్తరాంధ్ర హక్కులపై పోరాటం**

ఉత్తరాంధ్ర అభివృద్ధిని రెండు పవర్ ఫుల్ కుటుంబాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ఉత్తరాంధ్రలో చెరకు కర్మాగారాల మూసివేత వెనుక టిడిపి, వైసీపీ రెండు పార్టీల కుట్ర ఉందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి మూతపడిన చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరారు. అలాగే రైవాడ రిజర్వాయర్ కోసం భూములు ఇచ్చిన రైతులకు నీరు అందలేదన్నారు. ఈ ప్రాంత సమగ్ర వికాసానికి శ్రీకృష్ణ కమిటీ నివేదికను అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల హక్కుల పరిరక్షణకు తమ పార్టీ కృషి చేస్తుందని మాజీ ఎంపీ పేర్కొన్నారు. 1/70 చట్టం, జీవో నంబర్ 3లను సమగ్రంగా అమలు చేస్తామని, గిరిజనుల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే పేదరికం కారణంగా మతమార్పిడికి గురైన వర్గాలను తిరిగి హిందూత్వంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పేరును అధికారికంగా ప్రకటిస్తానని, ఆ తర్వాత ప్రజా సమస్యల తెలుసుకునేందుకు పాదయాత్ర చేపడతానని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

For a pure tomorrow..
జయహో

# మార్కెట్లలో మిశ్రమ ధోరణి

## బంగారంపై ఒత్తిడి, డిజిటల్ చెల్లింపుల్లో కొత్త అధ్యాయం

(ప్రతాప్)

**స్టాక్ మార్కెట్లలో అప్రమత్త ధోరణి**

భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ప్రారంభం నుంచే అప్రమత్త ధోరణిని ప్రదర్శించాయి. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు స్వల్ప లాభనష్టాల మధ్య ఊగిసలాడుతూ కనిపించాయి. అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలు, ముడి చమురు ధరల కదలికలు, అమెరికా ట్రెజరీ బాండ్ల దిగుబడులు, భారీ సంఖ్యలో వస్తున్న ఐపీఓల కారణంగా ఏర్పడుతున్న ద్రవ్యలభ్యత ఒత్తిళ్లు పెట్టుబడిదారుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే ఇటీవల ముడి చమురు ధరలు కొంత తగ్గుముఖం పట్టడం మార్కెట్లకు ఊరటనిచ్చింది. అయినప్పటికీ ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై నెలకొన్న అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు జాగ్రత్త వైఖరినే అవలంబిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతోంది**

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) వరుసగా నిధులను ఉపసంహరించుకోవడం దేశీయ ఈక్విటీ మార్కెట్లకు ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని రోజులుగా విదేశీ నిధుల ప్రవాహం ప్రతికూలంగా ఉండగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐలు) కొనుగోళ్లతో మార్కెట్‌కు అండగా నిలుస్తున్నారు. అయినప్పటికీ ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగితే మార్కెట్‌లో తక్షణ పుంజుకునే అవకాశాలు పరిమితమవుతాయని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. విదేశీ నిధుల ఉపసంహరణతో పాటు అధిక వడ్డీ రేట్ల అంచనాలు కూడా పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు.




**భారత్‌లో అడుగుపెట్టిన ఆపిల్ పే**

డిజిటల్ చెల్లింపుల రంగంలో మరో కీలక పరిణామంగా ఆపిల్ పే భారత మార్కెట్లో అధికారికంగా ప్రవేశించింది. ప్రస్తుతం ఎంపిక చేసిన యాక్సిస్ బ్యాంక్, వీసా, మాస్టర్‌కార్డ్ కార్డులకు మాత్రమే ఈ సేవ అందుబాటులో ఉంది. ప్రారంభ దశలో యూపీఐ, రూపే కార్డులకు మద్దతు లేకపోయినా, భవిష్యత్తులో మరిన్ని బ్యాంకులు, వ్యాపార సంస్థలను చేర్చే ప్రణాళికలను సంస్థ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ప్రాచుర్యం పొందిన ఈ సేవ భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో పోటీని మరింత పెంచే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. వినియోగదారులకు సురక్షితమైన, వేగవంతమైన చెల్లింపుల ప్రత్యామ్నాయంగా ఇది నిలవవచ్చని అంచనా వేస్తున్నారు.

**బంగారం ధరలపై వడ్డీ భయాల ప్రభావం**

అంతర్జాతీయ బంగారం మార్కెట్లో ఒత్తిడి కొనసాగుతోంది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల కోసం ప్రపంచ ఆర్థిక మార్కెట్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అదే సమయంలో అమెరికా కేంద్ర బ్యాంకు మరిన్ని వడ్డీ రేట్ల పెంపులను చేపట్టవచ్చన్న అంచనాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఫలితంగా ఈ నెలలో బంగారం ధరలు క్షీణత దిశగా పయనిస్తున్నాయి. సాధారణంగా వడ్డీ రేట్లు పెరిగినప్పుడు బంగారం వంటి వడ్డీ రాబడి ఇవ్వని ఆస్తులపై పెట్టుబడుల ఆకర్షణ తగ్గుతుంది. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తుండగా, బంగారం మార్కెట్ భవిష్యత్ దిశ అమెరికా ఆర్థిక గణాంకాలపైనే ఆధారపడి ఉండనుంది.

## అంబేద్కర్‌ను అవమానించడం కాదు...

# ఆయన ఆలోచనలను అర్థం చేసుకోవాలి

### "రిజర్వేషన్లపై రాద్ధాంతం.. రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరించడమే

**భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించడానికి ప్రధాన కారణాలలో భారత రాజ్యాంగం ఒకటి. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజాస్వామ్య జీవనానికి పునాదులుగా నిలిపిన రాజ్యాంగం కేవలం ఒక న్యాయపత్రం కాదు. కోట్లాది ప్రజల హక్కులు, ఆశలు, ఆకాంక్షలకు అది ఒక సామాజిక ఒప్పందం.ఈ రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్ర చారిత్రాత్మకమైనది. ఆయనను కేవలం ఒక వర్గానికి లేదా ఒక సామాజిక సమూహానికి చెందిన నాయకుడిగా చూడటం ఆయన ఆలోచనల పరిధిని కుదించడం అవుతుంది.**



సామాజిక అసమానతను ప్రశ్నించి, చట్టం ముందు సమానత్వాన్ని, అవకాశాల్లో న్యాయాన్ని, అణగారిన వర్గాలకు రక్షణను ప్రతిపాదించిన ఆలోచనాపరుడిగా అంబేద్కర్ భారత ప్రజాస్వామ్య చరిత్రలో నిలిచిపోయారు అటువంటి మహనీయుడు అంబేద్కర్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి అదే రాజ్యాంగం మిద ఆధారపడి పాలనా సాగిస్తున్నారు కాని నేడు కొందరు అతను రాసిన రాజ్యాంగాన్ని, అంబేద్కర్ పెట్టిన రిజర్వేషన్లను వ్యతిరేకించడం వరకే కాకుండా ఏకంగా ఆయన పేరు మరియు వ్యకిత్తం మీద బురద చల్లే వరకు వెళ్లాయి. హమారా ప్రసాద్ అనే వ్యక్తి ఏకంగా బాబా సాహెబ్‌ను 'కల్పిత నాయకుడు' అంటూ పుస్తకం రాసే వరకు వెళ్లింది. హమారా ప్రసాద్ ఏం చదువుకున్నాడు? ఆయనకు ఉన్న సామాజిక అవగాహన ఏమిటి? అన్నది ఈ సమాజం తెలుసుకోవాలి నిత్యం అంబేద్కర్ మీద నిందలేస్తూ అంబేద్కర్ వాదులను అసభ్యంగా బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్న సంఘవిద్రోహ శక్తి ఈ హమారా ప్రసాద్. ఈ హమారా ప్రసాద్ కూడా అంబేద్కర్‌ను అవమానించాలని చూస్తున్నాడు. అంబేద్కరంటే ఆకాశం. ఆ ఆకాశం మీద ఉమ్మే యాలని చూస్తే అది అతడి మీదే పడుతుంది.

**అంబేద్కర్ తన జీవితకాలం ఈ దేశంలోని అణగారిన వర్గాల కోసమే పని చేశాడు:-**

అంబేద్కర్ లేకపోతే ఈ హక్కులే ఉండేటివి కాదు. మరి అలాంటి హక్కులను ఉపయోగించుకుంటూ హక్కుల ప్రదాత మీదే బురద చల్లడం దుర్మార్గం. బాబా సాహెబ్ జ్ఞానానికి ప్రపంచ దేశాలే సలాం చేస్తున్నాయి. ఆయన జన్మదినాన్ని యూఎన్‌ఓ సైతం 'అంతర్జాతీయ నాలెడ్జ్‌డే'గా ప్రకటించింది. తాను చదువుకున్న కొలంబియా యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ విశ్వవిద్యాలయాలు అంబేద్కర్‌ను గౌరవిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మేధావులు ఎందరో ఆయన కృషిని కొనియాడుతున్నారు. అంబేద్కర్ ఆలోచనలలో అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటి సామాజిక ప్రజాస్వామ్యం. రాజకీయంగా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉన్నప్పటికీ, సామాజిక జీవితంలో ఒకరిని ఒకరు సమానులుగా చూడకపోతే ప్రజాస్వామ్యం సంపూర్ణం కాదనే భావన ఆయన ఆలోచనల్లో కనిపిస్తుంది.అందుకే నేడు అంబేద్కర్‌ను స్మరించుకోవడం అంటే కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కాదు. కుల వివక్ష, సామాజిక అసమానత, విద్యా అవకాశాల్లో వ్యత్యాసం, ఉపాధి అవకాశాల కొరత, మహిళలపై వివక్ష, అణగారిన వర్గాల హక్కులు వంటి సమకాలీన సమస్యలను కూడా పరిశీలించాలి మరి హమారా ప్రసాద్ మాత్రం ఆయన మీద విష ప్రచారం చేయడానికి ఏకంగా పుస్తకమే రాయడం క్షమించరాని నేరం! టైటిల్లోనే అతడి దురుద్దేశం అర్థమవుతున్నది. టార్గెట్ చేసి బాబా సాహెబ్ మీద బురద చల్లాలనే దుర్బుద్ధికి అంబేద్కరిస్టులు తప్పకుండా తగిన బుద్ధి చెప్తారు. చట్టబద్ధంగా అతడిని కఠినంగా శిక్ష పడేలా చేస్తారు.ఇట్లా అంబేద్కరిజాన్ని దిగజార్చే ప్రయత్నాలు ముప్పేట జరుగుతున్నాయి. ఇప్పుడు బహుజన సమాజం అంబేద్కరిజం బాటలో మరింత పదునెక్కాలి.భారత రాజ్యాంగాన్ని, బాబా సాహెబ్ స్ఫూర్తిని కాపాడుకోవాలి.

**రిజర్వేషన్లను తొలగించాలని వాదించడం అంటే అణగారిన వర్గాల అభివృద్ధిని అడ్డుకోవడమే! :**

రిజర్వేషన్లను వ్యతిరేకించేవారికి రిజర్వేషన్ల చరిత్ర గాని, ఆవశ్యకతగాని తెలియదు. మిడిమిడి జ్ఞానంతో తమ అక్కసును వెళ్లగక్కడం మాత్రమే తెలుసు. వారికి ఎక్కువ ప్రతిభ ఉన్నా తగిన అవకాశాలు దక్కలేద నన్నది అందుకు కారణం. ఎస్సీ ఎస్టీ బీసీలకు మాత్రం పాస్ మార్కులొచ్చినా రిజర్వేషన్ల వల్ల అవకాశాలు లభిస్తున్నయన్నది వారి ఆరోపణ. ఈ రకమైన వాదన మండల్ కమీషన్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వా లన్న ప్రతిపాదన తెచ్చినప్పుడు కూడా చేశారు. రిజర్వేషన్లతో చదివే వారికి ప్రతిభ అనేదే ఉండదని, వారు వైద్యం చేస్తే పేషెంట్లు చస్తారని, ప్రాజెక్టులు కడితే కూలిపోతా యని అడ్డంగా వాదించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందాక నోళ్లు మూతపడ్డాయి. ఇప్పుడు మారిజర్వేషన్లను తొలగించాలని కొత్తరాగం ఎత్తుకున్నారు. ఈ కృత్రిమ ఉద్యమాన్ని కూడా జెన్ జీ అకౌంట్లో వేసే ప్రయత్నం చేశారు. కానీ, వీరంతా సామాజిక న్యాయం అనే ప్రాథమిక సూత్రాన్ని విస్మరించారు. ఇప్పటికే ఆర్థికంగా సామాజికంగా ముందంజలో ఉన్నవారిని, వెనుకబడిన వారిని ఒకే గాటన కట్టడం ఎలా కరెక్ట్ అవుతుంది. తరాలుగా ఉన్న ఈ అంతరాలను ఎట్లా పరిష్కరించాలో తెలియని వారే అడ్డంగా వాదిస్తున్నారు. ఈ దేశంలో ఈ మాత్రం ప్రగతి సాధ్యమై, అభివృద్ధిలో అణగారిన వర్గాలు నామమాత్రంగానైనా భాగస్వాములు కాగలిగారంటే అందుకు కారణం రిజర్వేషన్లే. మరి అలాంటి రిజర్వేషన్లను తొలగించాలని వాదించడం అంటే అణగారిన వర్గాల అభివృద్ధిని అడ్డుకోవడమే! రాజ్యాంగ నిర్మాత ఆశయాలను తుంగలో తొక్కడమే.అంబేద్కర్‌ను విమర్శించడం లేదా రిజర్వేషన్లపై ప్రశ్నలు లేవనెత్తడం మాత్రమే సమస్య కాదు; ఆ విమర్శలు వాస్తవాలు, రాజ్యాంగ స్ఫూర్తి, సామాజిక వాస్తవికత ఆధారంగా ఉన్నాయా లేదా అన్నదే అసలు ప్రశ్న. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ అభిప్రాయ స్వేచ్ఛ ఉంటుంది. అయితే ఆ స్వేచ్ఛతో పాటు చారిత్రక వాస్తవాలను గౌరవించే బాధ్యత కూడా ఉంటుంది. రిజర్వేషన్లు ఎవరికైనా శాశ్వతంగా ఇచ్చిన ప్రత్యేక హక్కులు కావు. సామాజికంగా, విద్యాపరంగా, చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం ఏర్పరచిన ఒక సామాజిక న్యాయ సాధనం. సమాజంలో అసమానతలు కొనసాగుతున్నంతకాలం వాటి పరిష్కారంపై చర్చ కూడా కొనసాగాలి.అంబేద్కర్‌ను అవమానించడం ద్వారా ఆయన ఆలోచనలు అంతరించవు. రాజ్యాంగాన్ని విమర్శించడం ద్వారా రాజ్యాంగ విలువలు కనుమరుగుకావు.

**విమర్శలకు వాస్తవాలు, రాజ్యాంగ స్ఫూర్తి ఆధారం కావాలి:**

రిజర్వేషన్లను వ్యతిరేకించడం ద్వారా శతాబ్దాల సామాజిక అసమానతలు ఒక్కరోజులో తొలగిపోవు. సమానత్వం కోసం సాగిన పోరాటం మరింత బాధ్యతాయుతమైన చర్చను, మరింత న్యాయబద్ధమైన సమాజ నిర్మాణాన్ని కోరుతోంది.గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే---రాజ్యాంగం ఒక పుస్తకం కాదు, అది కోట్లాది భారతీయుల హక్కులకు రక్షణ. అంబేద్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదు, సామాజిక న్యాయం కోసం సాగిన చారిత్రక పోరాటానికి ప్రతీక. రిజర్వేషన్లు ఒక దానం కాదు సమాన అవకాశాల దిశగా చేపట్టిన రాజ్యాంగపరమైన చర్య. అందువల్ల రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడం, భిన్నాభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించడం---ఇదే నేటి భారత సమాజం పై ముందున్న బాధ్యత.



**ఎన్.సీతారామయ్య**
**9440972048**

# నేడు రక్తదాత - రేపు ప్రాణదాత..!!

### అక్టోబర్ 1వ తేదీ జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక శీర్షిక

**భారతదేశంలో అక్టోబర్ ఒకటవ తేదీన జాతీయ రక్తదాన దినోత్సవం జరుపుకుంటాము రక్తం అనేది ఎర్రటి ద్రవం మాత్రమే కాదు అది ఒక జీవనది. మన శరీరంలో సుమారు 5 నుండి 6 లీటర్లు రక్తం ఉంటుంది.సాధారణంగా పురుషుల్లో 13 నుండి 17 శాతం, స్త్రీలలో 12 నుండి 15శాతం, ఉండాలి . ఇరువురిలో అంతకన్నా తక్కువ శాతం రక్తం ఉంటే దానిని అనీమియా గా పిలుస్తారు.**




రక్తానికి కులం లేదు.మతం లేదు. ధనిక, పేద తేడా లేదు రక్తం అందరిలోనూ ఎరుపు రంగులోనే ఉంటుంది. ప్రతి వ్యక్తి తన జీవితంలో మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేయవచ్చును. రక్తాన్ని దానం చేయడం వలన ఎంతోమంది జీవితాల్లో మళ్ళీ ప్రాణాన్ని ఇచ్చిన వాళ్ళం అవుతాము. ప్రస్తుత సమాజంలో ఎక్కువగా ప్రమాదాల కు గురై వ్యక్తులు రక్తాన్ని కోల్పోయి క్షణిక కాలంలోనే ప్రాణాలు విడిచి పెడుతున్నారు. రక్తాన్ని దానంగా ఇవ్వడం వలన ప్రమాదాల గురించి వారి ప్రాణాలు నిలుపగలుగుతాము.

**భారతదేశంలో రక్తహీనత ( అనీమియా )ఒక మహమ్మారి**

దేశంలో ప్రతి ఇద్దరి వ్యక్తుల్లో సగటున ఒకరికి రక్తం తక్కువగా ఉంది. రక్తహీనత లాభం వలన మనిషి అనీమియా వ్యాధి గురై చనిపోయే అవకాశం ఉంది. ఈ వ్యాధికి గురి అయిన మనిషి బలహీనతగా నిస్సత్తువాయి అలసట గుండె దడ, కళ్ళు తిరగడం, జుట్టు రాలడం, గోళ్లు తెల్లబడడం, నిద్ర పట్టకపోవడం, కోపం ఎక్కువగా రావడం, సంతానం కలగకపోవడం, చిన్న వయసులోనే గుండెపోటు రావడం, ఇవన్నీ జరుగుతాయి వ్యక్తికి రక్తం చాలా అవసరం.

**రక్తదానం ఎవరు చేయొచ్చు...?**

సగటున 18 నుంచి 65 సంవత్సరములు ఉన్నవారు, 45 కేజీల పైన బరువు ఉన్నవారు, రక్తంలో హిమోగ్లోబిన్ 12.5శాతము పైన ఉన్నవారు రక్తదానం చేయడానికి అర్హులు. మూడు నెలలకు ఒక మారు రక్తాన్ని దానం చేయవచ్చును.

**రక్తదానం ఎవరు చేయకూడదు..?**

జ్వరం ఉన్నవారు, మధుమేహం, బీపీ, గుండె జబ్బులు ఉన్నవారు, పాలిచ్చే తల్లులు, ఊబకాయిలు, గర్భిణీ స్త్రీలు, ఇతర వ్యాధులు బారినపడి సతమతమయ్యేవారు, రక్తదానం చెయ్యకపోవడం ఉత్తమం. రక్తదానం చేయకూడదు.

**రక్తదానం చేయడం వలన కలిగే లాభాలు**

వ్యక్తులు రక్తదానం చేసే వారు వివిధ రకాలైన లాభాలను పొందుతారు. రక్తదానం చేయడం వలన ఎటువంటి నష్టము ఉండదు. 24 గంటల్లో కొత్త రక్తం తయారవుతుంది గుండెపోటు క్యాన్సర్ రిస్క్ 80% తగ్గుతుంది. బరువు, కొలెస్ట్రాల్ అదుపులో ఉంటాయి. రక్తదానం చేయడం వల్ల 650 క్యాలరీలు తగ్గుతాయి. తేజస్సు పెరుగుతుంది శరీరంలో కొత్త కణాలు పుడతాయి. మీరు ఇచ్చే రక్తదానం వలన ముగ్గురు ప్రాణాలు నిలబడతాయి.

**రక్తం పెరగాలి అంటే ఎటువంటి ఆహారం తీసుకోవాలి - ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి**

మానవ జీవితం చాలా చిన్నది. సరైన ఆహారం సరైన వ్యాయామం చాలా అవసరం. ప్రతిరోజు దినచర్యలో మన శరీరంలో అన్ని భాగాలకి రక్తం సరఫరా అయితేనే అన్ని భాగాలు బాగా పనిచేస్తాయి. రక్తం వృద్ధి చెందాలి అంటే తాజా పండ్లు కూరగాయలు ముఖ్యంగా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. తోటకూర, పాలకూర మునగాకు, గోంగూర ఎక్కువ రక్తాన్ని చేకూర్చే ఆకుకూరలు. బీట్రూట్, నువ్వులు, ఖర్జూరం, ఎండు ద్రాక్ష, అంజీర, రాగులు ఇతర సిరి ధాన్యాలు మొలకెత్తిన పెసలు తినడం వలన రక్తం బాగా వృద్ధి చెందుతుంది. ఉసిరి, దానిమ్మ ఆపిల్, మేకపాలు రక్తం వృద్ధి చెందడానికి శ్రేష్టమైన ఆహార పదార్థములు. పిల్లలకి చాక్లెట్లు బదులు చిన్నతనం నుంచి ఖర్జూరం ఇవ్వడం అలవాటు చేయాలి. వారంలో మూడు రోజులు తప్పనిసరిగా ఆకుకూరలతో భోజనం చేయాలి. బీట్రూట్ తో వివిధ రకాలైన ఆహార పదార్థాలు తయారు చేసి అందంగా అలంకరించి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు. గర్భిణీలు ప్రతిరోజు 250 ఎమ్. ఎల్. బీట్రూట్ రసాన్ని తాగితే రక్తహీనతను అధిగమించ వచ్చును.

రక్తదాతగా ముందుకి అడుగులు వేద్దాం, రక్తాన్ని దానంగా ఇద్దాం,ప్రాణాన్ని నిలుపుదాం అనే నినాదాన్ని విద్యార్థి దశ నుంచి తలవరుచుకుంటే రక్తదాతలుగా వ్యక్తులు నిలుస్తారు.

**రచన**
**ఏ బాల సౌజన్యకుమారి,**
**నంది అవార్డు గ్రహీత,**
**తెలుగు ఆచార్యులు,**
**ఆధ్యాత్మికవేత్త, ప్రవచనాకర్త**



## కోర్టు తీర్పు బేఖాతర్..

# అధికారుల మొద్దునిద్ర!

### అరకులో రెవెన్యూ, పంచాయతీ నిర్లక్ష్యం - గిరిజన చట్టం 1/70 నీరుగార్పు?.

### నోటీసు 7 ఇవ్వాలి.. 6 ఇచ్చారు! కోర్టునే తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు.

**అరకులోయ: సెప్టెంబర్ 30, జయ జయహే.**

పర్యాటక కేంద్రం అరకులోయలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ శాఖ తీరు వివాదాస్పదంగా మారింది. కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..అరకు పట్టణంలో పోలీస్ స్టేషన్ సమీపంలో, ఐటీడీఏ క్వార్టర్స్ ను ఆనుకొని సుంకరమెట్టకు చెందిన ఓ గిరిజనేతర వ్యాపారి (రామ బంగార్రాజు) ప్రభుత్వ అనుమతి లేకుండా, వీధి కాలువను సైతం ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టారు.దీనిపై స్థానిక గిరిజనులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు అక్రమ నిర్మాణంగా గుర్తిస్తూ.. ముందుగా నోటీసు 6, ఆ తర్వాత నోటీసు 7 జారీ చేయాలని నిర్మాణం యదాస్తదంగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.



**కానీ అధికారులు చేసింది ఏంటి?..**

కోర్టు చెప్పిన దానికి రివర్స్ లో.. నోటీసు 7 ఇవ్వకుండానే నేరుగా నోటీసు 6 ఇచ్చి చేతులు దులుపుకున్నారు రెవెన్యూ అధికారులు. ఇది పూర్తిగా కోర్టు ఆదేశాల ఉల్లంఘన కిందకే వస్తుంది.ఇదే అదునుగా పెదలబుడు గ్రామపంచాయతీ అధికారులు కూడా మొద్దునిద్రలో ఉండటంతో నిర్మాణం యథావిధిగా కొనసాగుతోంది..

"గిరిజనుల కోసం ఉన్న 1/70 చట్టాన్ని అధికారులే నీరుగారుస్తున్నారు. గిరిజనేతరుడికి పరోక్షంగా సహకరిస్తున్నారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించకపోతే రెవెన్యూ, పంచాయతీ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తాం" అని స్థానిక గిరిజనులు హెచ్చరిస్తున్నారు..

అక్రమ నిర్మాణాన్ని తక్షణమే కూల్చివేసి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

# విశాఖ వాసులకు మరింత చేరువగా మొబైల్ డీజీ రైతు బజార్

### వృద్ధులు, గేటెడ్ కమ్యూనిటీలే లక్ష్యంగా మొబైల్ సేవలు ప్రారంభం

### ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నాణ్యమైన కూరగాయలు, పండ్లు

### దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసే దిశగా మరో ముందడుగు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 30, జయ జయహే**




విశాఖ నగర ప్రజలకు నాణ్యమైన, తాజా కూరగాయలు, పండ్లను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా డీజీ రైతు బజార్ మరో ముందడుగు వేసింది. ఇప్పటికే ఆన్‌లైన్ సేవల ద్వారా ఇంటింటికీ కూరగాయలు, పండ్లను అందిస్తున్న డీజీ రైతు బజార్ తాజాగా మొబైల్ డీజీ రైతు బజార్ సేవలను ప్రారంభించింది. విశాఖ మహానగర పరిధిలోని మధురవాడ మిధిలాపురి కాలనీలో బుధవారం మొబైల్ డీజీ రైతు బజార్ సేవలను ప్రారంభించారు. ముఖ్యంగా వృద్ధులు, బయటకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఇంటి వద్దకే తాజా కూరగాయలు**

సాధారణంగా కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు మార్కెట్లకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే మొబైల్ డీజీ రైతు బజార్ ద్వారా ప్రజలు నివసించే ప్రాంతాలకే కూరగాయలు, పండ్లను తీసుకెళ్లి విక్రయించనున్నారు. దీంతో వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, వాహన సౌకర్యం లేని వారు సైతం తమకు అవసరమైన తాజా కూరగాయలను సులభంగా కొనుగోలు చేసుకునే అవకాశం కలుగుతోంది. రైతుల నుంచి సేకరించే నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే కూరగాయలు, పండ్లు విక్రయించడం ఈ సేవల ప్రధాన లక్ష్యంగా ఉంది. తద్వారా వినియోగదారులపై అనవసరమైన ధరల భారం పడకుండా చూడటంతో పాటు, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట**

రైతు నుంచి వినియోగదారుడి వరకు సరఫరా వ్యవస్థలో మధ్యవర్తుల సంఖ్య పెరగడం వల్ల అనేక సందర్భాల్లో కూరగాయలు, పండ్ల ధరలు పెరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్‌ను కల్పిస్తూ, వినియోగదారులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నాణ్యమైన ఉత్పత్తులను అందించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. డీజీ రైతు బజార్ ఆన్‌లైన్ సేవలతో పాటు మొబైల్ రైతు బజార్‌ను కూడా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతు--వినియోగదారు మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. గేటెడ్ కమ్యూనిటీలకు, నివాస ప్రాంతాలకు మొబైల్ వాహనాల ద్వారా సేవలను విస్తరించడం వల్ల ఒకే ప్రాంతంలోని అనేక కుటుంబాలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

**మరిన్ని ప్రాంతాలకు విస్తరణపై ఆశలు**

మిధిలాపురి కాలనీలో ప్రారంభమైన మొబైల్ డీజీ రైతు బజార్ సేవలు నగరంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించగలిగితే మరింత మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యంగా వృద్ధులు, ఒంటరిగా నివసించే వారు, గేటెడ్ కమ్యూనిటీల్లోని కుటుంబాలకు ఈ సేవలు ఎంతో ఉపయుక్తంగా మారనున్నాయి. తాజా కూరగాయలు, పండ్లు ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించడం ద్వారా వినియోగదారులకు ధరల భారం తగ్గించడం, మధ్యవర్తుల పాత్రను నియంత్రించడం, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించడం వంటి లక్ష్యాలతో మొబైల్ డీజీ రైతు బజార్ సేవలు ముందుకు సాగుతున్నాయి. ఆన్‌లైన్ సేవల నుంచి మొబైల్ సేవల వరకు డీజీ రైతు బజార్‌ను విస్తరించడం ద్వారా విశాఖ నగర ప్రజలకు తాజా కూరగాయలు, పండ్లు మరింత చేరువ చేయడంలో ప్రభుత్వం మరో కీలక అడుగు వేసినట్లయింది.



# అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీ స్త్రీలకు సన్మానం

**విశాఖపట్నం జయ జయహే**

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవకు 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, భారత ప్రధానమంత్రిగా 12 సంవత్సరాల పాటు ప్రజలకు సేవలందించిన సందర్భంగా విశాఖపట్నం ఈస్ట్ నియోజకవర్గంలోని ఎంవిపి కాలనీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మరియు గర్భిణీ స్త్రీలను శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. మహిళల సంక్షేమం, మాతా-శిశు ఆరోగ్యం, సామాజిక అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి ఈ కార్యక్రమం ద్వారా గౌరవం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, గర్భిణీ స్త్రీల ఆరోగ్యం మరియు పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, అరుణ కుమారి, లీలావతి, లక్ష్మి పాల్గొన్నారు. అలాగే బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




### విశాఖ ఎకానమిక్ రీజియన్

# అభివృద్ధిపై సమీక్ష

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖ ఎకానమిక్ రీజియన్ అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టులపై వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ పాల్గొని ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వి ఈ ఆర్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రస్తుతం కాన్సెప్ట్ దశలో ఉన్న ప్రాజెక్టులను కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు తీసుకెళ్లి గ్రౌండ్ లెవల్‌లో అమలు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. విశాఖ ఎకానమిక్ రీజియన్ అభివృద్ధికి దోహదపడే కీలక ప్రాజెక్టులను గుర్తించి, వాటి అమలుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. అలాగే, గుర్తించిన ప్రాజెక్టుల ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రాజెక్టుల రూపకల్పన ఉండాలని పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ ప్రాజెక్టుల పురోగతి, అమలు దశలు, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, సి ఈ వినయ్ కుమార్, ఓ ఎస్ డి కృష్ణ నాయక్, అదనపు కార్యదర్శి రుషి బాబు, ఎస్ ఈ లు రాంబాబు, మధుసూదనరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి నుంచి వారణాసి వరకు సేవా సంకల్ప యాత్ర

### మంత్రి నారా లోకేష్ సూచనలతో ఆధ్యాత్మిక యాత్ర

### వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ నేతృత్వంలో బైక్‌లపై ప్రయాణం

**విశాఖపట్నం( జయ జయహే)**





ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పురస్కరించుకొని టి ఎన్ ఎస్ ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో సేవా సంకల్ప యాత్ర చేపట్టారు. టీడీపీ జాతీయ వర్కింగ్ అధ్యక్షులు, మంత్రి నారా లోకేష్ సూచనలతో తిరుపతి నుంచి వారణాసి వరకు 25 మంది యువత బైక్ యాత్రకు శ్రీకారం చుట్టారు. సుమారు 2500 కిమీ మేర సాగే ఈ బైక్ యాత్ర కు వి ఎం ఆర్ డి ఎ చైర్మన్, టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం వి ప్రణవ్ గోపాల్ నేతృత్వం వహిస్తున్నారు. బుధవారం తిరుపతి అలిపిరి గరుడ సర్కిల్ వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు , తిరుపతి టీడీపీ ఇంచార్జి జే బి శ్రీనివాస్ , సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ , సత్యవేడు అసెంబ్లీ సమన్వయ కర్త పి శంకర రెడ్డి , తిరుపతి పార్లమెంట్ ఇంచార్జి పనబాక లక్ష్మి యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , ఇతర కూటమి నాయకులు పాల్గొని బైక్ యాత్రను ప్రారంభించారు. ఈ నెల 30 న ప్రారంభమైన ఈ సేవా సంకల్ప యాత్ర అక్టోబర్ 8 న బైక్ యాత్ర వారణాసి చేరుకుంటుందని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల మీదుగా ఈ బైక్ యాత్ర సాగుతుందని తెలిపారు. ఈ యాత్రలో భాగంగా పలు ప్రముఖ ఆలయాలను దర్శించనున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సుపరిపాలన, ఆర్థిక ప్రగతి, మౌలిక వసతుల విస్తరణలో ఆయన చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాక్షించారు. బైక్ యాత్ర లో భాగంగా తిరుపతి నుంచి కాళహస్తి చేరుకోగా, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాళహస్తి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కాళహస్తి నుంచి కావలి వరకు బైక్ యాత్ర చేరుకుంది. గురువారం సాయంత్రం నాటికి ఈ బైక్ యాత్ర విజయవాడకి చేరుకుంటుందని తెలిపారు.



### ఓటు హక్కు రక్షణకు

# కాంగ్రెస్ సమరభేరి

### ఈసి పై సమగ్ర దర్యాప్తు చేయాలి.. జ్ఞానేశ్వర్ కుమార్‌ను తొలగించాలి

**రాజమహేంద్రవరం: జయ జయహే : సెప్టెంబర్ 30**

ఎన్నికల కమిషన్ పనితీరు, ఓటర్ల జాబితాల సవరణలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతిని ఉద్దేశించి సబ్ కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ కోఆర్డినేటర్ టీ.కే. విశ్వేశ్వర్ రెడ్డి, రాజమండ్రి అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, ఎపి కిసాన్ కాంగ్రెస్ సెల్ చైర్మన్ కామాని ప్రభాకర్ రావు, రాష్ట్ర సీనియర్ నాయకురాలు ఆకుల భాగ్యలక్ష్మిమాట్లాడుతూ ఈసి పై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారన్న ఆరోపణలపై పూర్తిస్థాయి పరిశీలన చేసి, ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ, ఎన్నికల సంఘం స్వతంత్రత, సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలపై కూడా వాస్తవాలను ప్రజలముందుంచాలని కోరారు. ఎన్నికల సంఘం రాజకీయ ప్రభావాలకు అతీతంగా స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేసేలా మార్పులు తీసుకురావాలని అన్నారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఓటు హక్కు పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, కొవ్వూరు టౌన్ ప్రెసిడెంట్ బచ్చు బుజ్జిబాబు, జిల్లా డాక్టర్ సెల్ చైర్మన్ రాజశేఖర్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సింధియా రాణి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోత శారద, అర్బన్ బిసి సెల్ చైర్మన్ తాడి సూరిబాబు, అనపర్తి ఇన్‌చార్జి గుండ్రపు ఏసు, బిక్కవోలు మండల ఇన్‌చార్జి కొల్లి చిన్న, నిడదవోలు కోఆర్డినేటర్ ఎం. భద్రం దొర, బర్రెసుబ్రహ్మణ్యం, ఎం.డి. ఆలీ, మురళీకృష్ణ, యాళ్ల వీరభద్రరావు, లలిత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌ఐఆర్‌పై కాంగ్రెస్ ప్రచారం కుట్రే!

### ఈసి రాజీనామా డిమాండ్ అందులో భాగమే: నల్లమిల్లి

**రాజమహేంద్రవరం: జయ జయహే:**

అక్టోబర్ 1:కాంగ్రెస్, ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం వెనుక రాజ్యాంగబద్ధ వ్యవస్థలను అస్థిరపరిచే కుట్ర ఉందని అనపర్తి ఎమ్మెల్యే, రాష్ట్ర బిజెపి ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని తూర్పుగోదావరి జిల్లా బిజెపి కార్యాలయంలో బుధవారంనిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చౌకబారు విమర్శలు మానుకోవాలని సూచించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియపై రాహుల్‌గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు కేంద్ర ఎన్నికల సంఘంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని నల్లమిల్లి విమర్శించారు. ఎస్‌ఐఆర్‌పై ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపిందని పేర్కొన్నారు. ఒక పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని కమిషన్‌లో విభేదాలున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారన్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన అన్నారు. మరణించిన వారు 2.8 కోట్లు, ఆచూకీ లేనివారు 3 కోట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు 6.3 కోట్లు, డూప్లికేట్ ఓట్లు కోటి వరకు ఉన్నాయని, నిబంధనల ప్రకారమే వాటిని జాబితాల నుంచి తొలగించినట్లు వివరించారు. పౌరసత్వం, ఓటు హక్కుపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని నల్లమిల్లి ప్రశ్నించారు. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూడా ఎస్‌ఐఆర్ ప్రక్రియపై అవగాహన లేదని విమర్శించారు. ఎస్‌ఐఆర్ సార్వత్రిక ఎన్నికలు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించినదే తప్ప స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం లేదన్నారు. ఓటర్ల జాబితాను కేంద్రీకృతం చేయలేదని, కేవలం డిజిటలైజేషన్ మాత్రమే జరిగిందని చెప్పారు. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి స్థాయిలోనే అధికారాలు కొనసాగుతున్నాయని వివరించారు. దేశంలో కొత్తగా యువ ఓటర్లు చేరుతున్న నేపథ్యంలో 'జెన్ జీ' ఓటర్ల అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. రాజ్యాంగబద్ధ సంస్థలు, న్యాయస్థానాలపై అనవసర ఆరోపణలు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో బిజెపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్మల దత్తు, అడబాల రామకృష్ణ, రజిని, బేతిరెడ్డి ఆదిత్య, వీరవీరాంజనేయులు, కందికొండ రమేష్, చిక్కం మోహిని, రవణమ్మ, పెరుమాళ్ల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల నోటిఫికేషన్ గడువు పొడిగించాలి

### అర్హులైన నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి

**టెక్కలి సెప్టెంబర్ 30 జయ జయహే**



శ్రీకాకుళం జిల్లాలో 22 ఆశా వర్కర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి, సెప్టెంబరు 30 లోపే గడువు ముగించి జిల్లాలోని నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆశా వర్కర్ల నోటిఫికేషన్ గడువు పొడిగించి జిల్లాలోని అన్ని మండలాలకు తగు సమాచారమిచ్చి ఉద్యోగాలు బర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి అధ్యక్షులు తలసముద్రం సూర్యం డిమాండ్ చేశారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగులకు ఆశా వర్కర్ల నోటిఫికేషన్ సమాచారం చేరలేదని ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలోని అన్ని మండలాలకు ఆశా వర్కర్ల నోటిఫికేషన్ సమాచారాన్ని అందించాలని సూర్యం అన్నారు. ఆశా వర్కర్ల గడువు తక్షణమే పొడిగించి అర్హులైన నిరుద్యోగులు అందరికీ న్యాయం చేయాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ పోరాట సమితి ఆందోళనలు చే పడతామని సూర్యం స్పష్టం చేశారు.




## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

### విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

**విజయనగరం జయజయహే**

యువత గంజాయి మరియు డ్రగ్స్ కు దూరంగా ఆరోగ్యంగా ఉండాలని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు . బుధవారం డ్రగ్స్ కు వ్యతిరేకంగా భగత్ సింగ్ యూత్ ఫెస్ట్ లో భాగంగా ఎస్.ఎఫ్.ఐ, డి.వై.ఎఫ్.ఐ. ఆద్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మయూరి కూడలి నుండి బాలాజీ జంక్షన్ వరకు చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ గంజాయి మరియు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించేందుకు తమ శాఖ తరుపున అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.గంజాయి వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు, మానసిక సమస్యలు, చదువుపై ఏకాగ్రత తగ్గడం, భవిష్యత్ అవకాశాలు దెబ్బతినడం వంటి పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. గంజాయి రవాణా చేసినా, కలిగి వున్నా, వినియోగించినా, విక్రయించినా తీవ్ర నేరం క్రింద పరిగణించి, వారిని జైలుకు పంపడంఖాయమని హెచ్చరించారు.ప్రజల సహకారంతోనే గంజాయి మరియు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమని తెలిపారు. డ్రగ్స్ ను అంతం చేదాం - యువత భవిష్యత్తును కాపాడుకుందాం అనే నినాదంతో ర్యాలి కొనసాగింది.ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ. అఖిలభారత కార్యదర్శి ఆదర్స్ ఎం సాజి, రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మూలన పడి ఉన్న మోటార్ రిక్షాలను వెంటనే పంపిణీ చేయాలి: సుజాత సల్మాన్

**అరకులోయ: సెప్టెంబర్ 30.జయ జయహే.**

అరకు వేలి ఎంపీడీఓ కార్యాలయంలో మూలన పడి ఉన్న మోటార్ రిక్షాలను అర్హులైన దివ్యాంగులకు వెంటనే పంపిణీ చేయాలని సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన వాహనాలు కార్యాలయంలోనే ఉండిపోవడంతో ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి ఉందని ఆమె అన్నారు. అర్హులైన దివ్యాంగులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో అనుమతుల పేరుతో జాప్యం చేయకుండా పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కోరారు. జిల్లా అధికారులు, ఎంపీడీఓ అధికారులు ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన దివ్యాంగులకు మోటార్ రిక్షాలను అందించాలని సుజాత సల్మాన్ డిమాండ్ చేశారు.

## ప్రజల సొమ్ము.. పార్టీ ప్రచారానికా?

**డుంబ్రిగూడ, సెప్టెంబర్ 30. జయ జయహే.**



ఎన్నికల ప్రచార సమయంలో ప్రతి ఒక్క విద్యార్థికి ఫీ(సెంబర్స్మెంట్ తల్లికి వధనం ఇస్తానని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు వాటిని పూర్తి స్థాయిలో విడుదల చేయకుండానే విద్యార్థులకు అరకొర డబ్బులు ఇచ్చి సరిపెడతామని కూటమీ ప్రభుత్వం పూనుకుంటుంది. పారామెడికల్ విద్యార్థులు స్టైఫండ్ అడిగితే వీటికి నిధుల్లేవని చెప్పి, తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ బిడ్డలు చదువుకోవడానికి కనీస వసతి పాఠశాల భవనాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిజంగా విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు నెరవేర్చేవారు. ప్రభుత్వం పథకాలకు ఖర్చు చేయకుండా సోషల్ మీడియా ఇన్ఫ్లుయె న్సర్లకు ఖర్చు పెట్టడానికి సిద్ధం కావడం సరికాదు. ప్రజల సొమ్ము ప్రజలకే చేరాలి. అంతే కానీ పార్టీ ప్రచారానికి వాడటమేమిటి? హామీలు అమలు చేయకుండా నచ్చినట్లు ప్రచారం చేయడానికి సోషల్ మీడియాను వాడుకుంటారా? అదే సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టడం సోషల్ మీడియా అకౌంట్ ని బ్లాక్ చేయడం ఎంత వరకు కరెక్ట్? ప్రజాధనాన్ని సంక్షేమ పథకాలకు ఉపయోగించకుండా, ప్రభుత్వ పార్టీ ప్రచారం కోసం సోషల్ మీడియా క్రియేటర్లకు ఇన్ఫ్లుయెన్సర్లకు నెలకు వేల రూపాయలు చెల్లించే విధానాన్ని తీసుకురావడం సరికాదని ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

## నేడు మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు పర్యటన

**దేవరాపల్లి, సెప్టెంబర్ 30, జయ జయహే**



మండలంలోని మూడు గ్రామాలలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ, పల్లె పండుగ 3.0 అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. తారువ గ్రామంలో పల్లె పండుగ 3.0 అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ఎం. అలమండ గ్రామంలో వారాడ నుండి వేచలం గ్రామం వరకు రూ.3 కోట్ల తో వేసిన ఆర్ అండ్ బి రోడ్డు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం పల్లె పండుగ 3.0 అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## శోభన్ బాబు మొనగాడు చిత్రానికి 50 ఏళ్ళు పూర్తి

**భీమవరం : (జయ జయహే)**

అందాల నటుడు తెలుగు ప్రేక్షకులను అలరించే నటులు శోభన్ బాబు అని, ఆయన నటించిన మొనగాడు (30-9-1976) చిత్రానికి నేటికీ 50 సంవత్సరాలు పూర్తి అయ్యాయని, అప్పట్లోనే మొనగాడు చిత్రం రికార్డులను తిరగరాసిందని అఖిల భారత శోభన్ బాబు కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాస రావు బొండా రాంబాబు తెలిపారు. బుధవారం జరిగిన అఖిల భారత శోభన్ బాబు సభ్యుల సమీక్ష సమావేశం మురారి జ్యుయలర్స్ లో మొనగాడు చిత్ర విశేషాలను వివరించారు. మొనగాడు చిత్రం 1976 లో విడుదలయిందని, 11 కేంద్రాల్లో 50 రోజులు, 4 కేంద్రాలలో 100రోజులు ఏకైక చిత్రమని అన్నారు. ఈ చిత్రంతోనే శోభన్ బాబు డ్యూయల్ రోల్ చేసిన మొదటి చిత్రమని, అన్నదమ్ములుగా ఇద్దరు శోభన్ బాబులు కనిపిస్తారని, ఒక శోభన్ బాబు పల్లెటూర్లో ఉండే నాటకాల రాయుడుగాను, మరో శోభన్ బాబు నగరంలో ఉండే జువెల్ థీఫ్ గా నటించారని అన్నారు. 1976లో మొనగాడు చిత్రానికి ఎదురులేదన్నారు. లోయ వేణు బెనర్జీ, పెదపాటి రాజబాబు,కంచర్ల భాస్కరరావు గుప్తా మాట్లాడుతు మొనగాడు చిత్రం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విశాఖపట్నం అలంకార్ థియేటర్ లో ఈ చిత్రాన్ని ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు.




## రెండు కేజీల గంజాయి స్వాధీనం

### పోలీసులకు పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 30, జయ జయహే**

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకుని, వారి వద్ద నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కిరుబహారన్ రామచంద్రన్ (22), సంవత్సరాలు, అతని స్నేహితుడు విజయ్ సామ్, (24) ఇద్దరూ గంజాయి, మద్యం, సిగరెట్ వంటి చెడు అలవాట్లకు అలవాటు పడి, తమకు వచ్చే ఆదాయం సరిపోక డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి కొనుగోలు చేసి తరలించాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు .ఈ క్రమంలో వారు తమిళనాడు నుంచి రైలులో విశాఖపట్నం చేరుకున్నారు. అక్కడి నుండి బస్సులో పాడేరు మీదుగా ఒడిశా ప్రాంతానికి వెళ్లి, గంజాయి కోసం అక్కడ కొంతమంది వ్యక్తులను సంప్రదించారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వారిని ఒక మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లి, అక్కడ వారికి 2 కేజీల గంజాయిని రూ.7,000 కి విక్రయించినట్లు వారు తెలిపారన్నారు .అనంతరం గంజాయిని తమ బ్యాగులో పెట్టుకుని ఒడిశా నుండి అరకు, అనంతగిరి మీదుగా ప్రయాణించి, దేవరాపల్లి మండలం కాశీపురం మీదుగా విశాఖపట్నం వెళ్లాలని ప్రయత్నించారు. అయితే సమ్మెద గ్రామం వద్ద వాహనాలు అందుబాటులో లేకపోవడంతో నడుచుకుంటూ వస్తున్న సమయంలో, గంజాయితో సహా పోలీసులు వారిని పట్టుకున్నారు.వారి వద్ద నుండి లక్ష రూపాయలు విలువైన 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## ఏ. కొత్తపల్లిలో వైభవంగా వినాయకుని నిమజ్జనోత్సవం

### స్వామివారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

**దేవరాపల్లి, సెప్టెంబర్ 30, జయ జయహే**

మండలంలోని ఏ. కొత్తపల్లి గ్రామంలో ఎస్ వి ఎన్ యూత్, సి హెచ్ వి ఆర్ యువసేన ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, స్థానిక మాజీ సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సాయంత్రం 6 గంటల నుండి గణేష్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కోలాటాలు, తప్పిడి గుళ్ళు, తీన్మార్, భారీ మందుగుండు సామాగ్రితో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు, యువకులు మహిళలు, యువసేన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెనుగుపూడి విఆర్ఓ బొత్స ఎరకయ్య మృతి

**దేవరాపల్లి, సెప్టెంబర్ 30, జయ జయహే :**



మండలంలోని తెనుగుపూడి విఆర్ఓ బొత్స ఎరకయ్య (50) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కె.కోటపాడు మండలం వారాడలోని తన స్వగృహంలో అర్ధరాత్రి దాటిన తరువాత ఛాతిలో నొప్పిరావడంతో అతని కుటుంబీకులు ఆసుపత్రి తరలిస్తుండగా మృతి చెందారు. ఆయన తెనుగుపూడితో పాటు తిమిరాం, మామిడిపల్లి పంచాయతీలకు ఇన్ఛార్జ్ వీఆర్వోగా పనిచేస్తున్నారు. బుధవారం జరిగిన అంత్యక్రియలకు దేవరాపల్లి తదితర మండలాలకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు, మండలంలోని పలువురు వీఆర్వోలు హాజరై తమ సహచరుడికి ఘన నివాళు లర్పించారు. అంత్యక్రియలకు ప్రభుత్వం నుంచి రూ.25 వేలు అతని కుటుంబీకులకు అందజేసినట్లు తహశీల్దార్ పి. లక్ష్మీదేవి. తెలిపారు. వీఆర్వో మృతి పట్ల తహసీల్దార్ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ కె. అప్పారావు, రెవిన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## మలమూత్రాలు పడకుండా జాగ్రత్తలు తీసుకోండి

**చోడవరం సెప్టెంబర్ 30 జయ జయహే**



అనకాపల్లి విజయరామరాజుపేట వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి పై నుండి రైళ్లు వెళుతూ ఉంటే ఆ రైళ్లు వెళుతున్నప్పుడు మల మూత్ర విసర్జన బ్రిడ్జి కింద నుండి వెళు తున్న వాహనదారులపై పడుతుందనీ అందువలన యు ఇబ్బంది పడుతున్నారనీ ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన రైల్వే స్టేషన్ సూపర్డెంట్ రామకృష్ణ కు వినతిపత్రం అందజేశారు. రైలు వెళ్లే సమయంలో వాహనదారులు బ్రిడ్జి కిందకి వెళ్లకుండా అటు ఇటు ఆగిపోతున్నారనీ, దానివల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. కాబట్టి రైల్వే శాఖ వారు రైలు లో వెళుతున్న ప్రయాణికుల మూత్ర విసర్జన అండర్ బ్రిడ్జి గుండా వెళుతున్న వాహనదారులపై పడకుండా తగిన మరమ్మత్తులు చేపట్టి వాహన దారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



## మోదకొండమ్మ వారిని దర్శించుకున్న జడ్జి

**మాడుగుల సెప్టెంబర్ 30 జయ జయహే**

మాడుగుల మండలం ఎం కోడూరు గ్రామంలో వెలసిన శ్రీ మోదకొండమ్మ వారిని మాడుగుల కోర్టు ఇన్చార్జి మేజిస్ట్రేట్ బి వి విజయలక్ష్మి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. అక్కడ జరిగిన న్యాయవిజన్ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆమె ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం కమిటీ వారు ఆమెను సత్కరించే జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జి సంజీవరావు, బారు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ఎల్లారావు, న్యాయవాదులు జి కృష్ణమూర్తి, పి కొండలరావు, నరేష్, గ్రామ పెద్దలు గొల్లవిల్లి శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.




## ఎం.కోడూరులో న్యాయ విజ్ఞాన సదస్సు

**మాడుగుల, సెప్టెంబర్ 30, జయ జయహే**

మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామ సచివాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జడ్జి బి.వి. విజయలక్ష్మి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం వివాదాలను మధ్యవర్తిత్వం (మెడియేషన్) ప్రీ-లిటిగేషన్ పద్ధతుల్లో రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ఎల్లారావు, పలువురు న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పెన్షనర్ల హక్కులు కాలరాస్తున్న వాలిడిటీ చట్టం

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 30, జయ జయహే**

పెన్షన్ వాలిడిట్ 2025 చట్టం ద్వారా ప్రభుత్వ పెన్షనర్స్ పై పెద్దఎత్తున దాడి చేస్తుందని శ్రీకాకుళం జిల్లా జాయింట్ యాక్షన్ అధ్యక్షుడు హనుమంత్ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్, అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పేడాడ రాంబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు శ్రీకాకుళంలో పెన్షనర్లు ఆందోళన చేపట్టి జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ దైన కోర్టు తీర్పులకు చెల్లకుండా చేసే ఓవర్ రైటింగ్ అధికారాన్ని ప్రభుత్వం ఈ చట్టం ద్వారా కైవసం చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి పెన్షన్ వ్యాలిడిటీ 2శ25 చట్టాన్ని పరిశీలించాలన్నారు.ఈ ధర్నా కార్యక్రమాన్ని పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్ చౌదరి పురుషోత్తమనాయుడు ప్రారంభించారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ సంఘ జిల్లా అధ్యక్షులు ఆర్.రామచంద్రరావు , రాష్ట్ర సంఘ ప్రతినిధులు సురంగి మోహనరావు, బి భాస్కరరావు తదితరులు పెన్షనర్స్ సమస్యలు గురించి మాట్లాడారు.ఈ కార్యక్రమశీలో బొడ్డేపల్లి. మోహనరావు, , చిట్టి దాస్, వెంకట్రావు, దామోదర్ హెచ్ లక్ష్మీపతి, హేమనాచార్యులు, ఏ గోవిందరాజులు, రంగనాథశీ, అప్పలనాయుడు, ఎస్ హుటాసెన్,రమణ తోపాటు సుమారు మూడు వందల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం





## కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగ పునర్నిర్మాణం -- డా.తెంటు అనిల్

**విజయనగరం, సెప్టెంబర్ 30, (జయ జయహే)**

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ మహారాజా కళాశాల (ఎ) సంయుక్తంగా "డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగ పునర్నిర్మాణం" అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026ను విజయనగరం కోటలో నిర్వహించాయి.కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభమై, అనంతరం డా. పి.వి.జి. రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ హెడ్ డా. కుసుమ పర్యాటక ప్రక్రియ, సమకాలీన సవాళ్లు, ఇటీవలి అభివృద్ధులు, కెరీర్ అవకాశాలపై ప్రసంగిస్తూ, విద్యార్థులు పరిశ్రమకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.రిజిస్ట్రార్ ఇన్‌చార్జి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా పర్యాటక రంగానికి మానవ జీవితంతో ఉన్న నైతిక అనుసంధానాన్ని ప్రస్తావిస్తూ, మానవ విలువలు, స్థానిక సమాజాలు, సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.విశిష్ట అతిథి ప్రొ. కె.వి.ఎల్. రాజు, కరస్పాండెంట్, మాన్సాస్ పర్యాటక రంగ చారిత్రక ఆవిర్భావం, పరివర్తనలు, సాంకేతిక జోక్యాలపై ప్రసంగిస్తూ, వారసత్వాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించే అవకాశాలను వివరించారు.విశిష్ట అతిథి హాస్పిటాలిటీ నిపుణులు కందుల అర్జున్న, స్వాగత్ హోటల్స్ 21వ శతాబ్దంలో పర్యాటక, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాలకు అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలు, సేవా ప్రమాణాలు, ప్రాయోగిక అనుభవం గురించి వివరించారు.ముఖ్య అతిథి డా. అనిల్ కుమార్ టెంటు, డిప్యూటీ డైరెక్టర్, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగ పునర్నిర్మాణంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. పర్యాటక రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అవకాశాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రస్తావించారు.వీసీ ఇన్‌చార్జి ప్రొ. టి. శ్రీనివాసన్ తన ముగింపు ప్రసంగంలో పర్యాటక రంగంలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, బీబీఏ విద్యార్థుల 'ది జర్నీ ఆఫ్ చేంజ్' స్కిట్, స్వాగత్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ విద్యార్థుల ఫ్లెయిర్ బార్టెండింగ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, మహారాజా కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



## చిన్ననాటి స్నేహబంధానికి మానవత్వపు చేయూత

### స్నేహితుడి కుటుంబానికి అండగా రూ.87 వేల ఆర్థిక సాయం

**పొందూరు. (జయ జయహే )**

మండలం కింతలి గ్రామానికి చెందిన చింతాడ.మురళి ఇటీవలే మరణించగా, ఆ కుటుంబానికి చిన్న నాటి స్నేహితులు అండగా నిలిచారు. ఆపద సమయంలో తమ వంతు బాధ్యతగా భావించి మృతుడి కుటుంబానికి రూ.87 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ మా చిన్ననాటి మిత్రుడు చింతాడ.మురళి ఇటీవలే తనువుచాలించటం బాధగా ఉందని, మురళి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారని, ఆయన భార్య గృహిణి కావడంతో కుటుంబానికి ప్రధాన ఆధారమైన వ్యక్తిని కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటుగా మారిందన్నారు. పరిస్థితిని తెలుసుకున్న మండల పరిషత్ ఉన్నత పాఠశాల 1996-1997 10వ తరగతి స్నేహితులు మానవత్వంతో స్పందించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారని, ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహబంధం కేవలం మాటల్లోనే కాకుండా ఆపద సమయంలో చేతల రూపంలోనూ చూపించారన్నారు. కష్టకాలంలో తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి, "స్నేహం అంటే సంతోషంలో మాత్రమే కాదు.. కష్టాల్లోనూ తోడుగా నిలవడం" అనే సందేశాన్ని చాటారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితులు, స్థానికులు వారి మానవతా దృక్పథాన్ని అభినందించారు. ఈ సేవా కార్యక్రమంలో చింతాడ.మురళి స్నేహితులు మురళి, విశ్వనాథం, కళ్యాణి, రామారావు, రాజారావు, తులసీదాస్, అనిల్, చింతాడ.మురళి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలోకి చేరిక

**అరకులోయ, సెప్టెంబర్ 30: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం అరకు వేలి మండలంలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్, అరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శెట్టిబుట్టి, వారి కుమారుడు శెట్టి అశోక్ కుమార్ టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శెట్టి వెంకట్రావు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తమను ఆకర్షించాయని తెలిపారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల విశ్వాసంతో టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అరకు నియోజకవర్గంలో సియ్యారి దొన్నుదొర ప్రజలతో మమేకమవుతూ, స్థానిక సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటున్న తీరు, ఆయనపై ఉన్న అభిమానం కూడా టీడీపీలో చేరడానికి మరో కారణమని తెలిపారు. ఆయన నాయకత్వంలో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.శెట్టి అశోక్ కుమార్ చొరవతో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు కూడా టీడీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. లోతేరు మాజీ ఉపసర్పంచ్ శెట్టిగెను, శెట్టి మధు, బస్కి గ్రామానికి చెందిన పాంగి ప్రదీప్, మాజీ వార్డు సభ్యుడు నన్ని అప్పలరాజు, అనంతగిరి మండలం వాలసీ గ్రామానికి చెందిన బాక నరసింగరావు, హుకుంపేట మండలానికి చెందిన వార్డు సభ్యురాలు చట్టి కన్నమ్మ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పద్మాపురం పంచాయతీ నుంచి కిల్లో మహేష్ (సీపీఎం జిల్లా ఉపాధ్యక్షులు), పొట్టంగి కుమార్ (వార్డు సభ్యుడు), కిల్లో భీమరాజు, వంతల మహేష్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సముచిత గౌరవం కల్పిస్తూ అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, పెద్దలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, అరకు వేలి మండల పార్టీ అధ్యక్షుడు మహదేవ్, పెద్దలబుడు మాజీ ఎంపీటీసీ ఎల్.బి. భీమరాజు, బోసుబెడ్డ ఎంపీటీసీ సన్నాయి కృష్ణ, లోతేరు మాజీ సర్పంచ్ తెలగంజి గంగమ్మ, మాజీ ఎంపీటీసీ రామన్న, బొండం మాజీ సర్పంచ్ గొల్లూరి బాబురావు, పెద్దలబుడు వార్డు సభ్యుడు నాగరాజు, శెట్టి రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

### ఉపాధ్యాయురాలుగా మారి న జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి

**జంగారెడ్డిగూడెం, (జయ జయహే )**

విద్యార్థులకు విద్య ద్వారానే మంచి భవిష్యత్తు సాధ్యమని, విద్యతో పాటు సామాజిక, వైజ్ఞానిక విషయాలను అధ్యయనం చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల (బాలికలు) పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీలు చేశారు. వంటశాలను, వండిన పదార్థాలను, నిత్యవసర సరుకులు స్టాకును, మెనూ పట్టికను, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, విద్యా ప్రమాణలా స్థాయిని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వసతి, ఇతర గృహంలో తదితర సౌకర్యాలను పరిశీలించారు. టీచరుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించి, విద్యార్థులతో మమేకమై కొన్ని ప్రశ్నలను వేసి, జిల్లా కలెక్టరు సమాధానం రాబట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని, విద్యతో పాటు వారి ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పరిసరాలు పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో కాని ఏమాత్రం అలసత్వం వహిస్తే బాధ్యులుపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధ్యాయులు, వసతిగృహ అధికారులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించి, స్వంత పిల్లలుగా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం.వి.రమణ, మున్సిపల్ కమీషనరు కె.వి.రమణ, తహాశీల్దారు కె.స్లీవజోజి, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలి

**భీమవరం ;(జయ జయహే)**

పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘం అభివృద్ధి కృషి చేయాలని మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ మరియు కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కారుమూరి సత్యనారాయణ, కోట్ల నాని అన్నారు. 2026-28 సంవత్సరలకు గాను నూతనంగా ఎన్నికైన భీమవరం మండల అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులను బుధవారం డిఎన్నార్ కళాశాల రోడ్డులోని తాడిమళ్ళ కాంప్లెక్స్ లో మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘం అధ్యక్షులు తటవర్తి నాగ బదరి నారాయణ, కార్యదర్శి కురిశెట్టి కుమార్ బాబు, కోశాధికారి పానుగంటి శేఖర్, సహాయ కార్యదర్శులు గా క్లబ్ సభ్యులు మానేపల్లి రవి చిన్నారావు, కంచర్ల భాస్కరరావు గుప్త లను సత్కరించారు. కారుమూరి కిరణ్, బొండాడ మనీష్, తటవర్తి నారాయణ, కురిశెట్టి నాని మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభకు అనుబంధ సంస్థ భీమవరం మండల అర్బన్ ఆర్యవైశ్య సంఘంకు నియమితులు కావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సుమారు 3600 మంది సభ్యులతో భీమవరం మండల అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఏర్పడిందని, సంఘాన్ని బలోపేతానికి చేయడానికి అందరూ కలిసిగట్టుగా పని చేయాలని అన్నారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో సంఘాన్ని మరింత బలోపేతాన్ని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పున్నాని కనకరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, గుండు సుమూర్తి, పులవర్తి రామకృష్ణ, కురిశెట్టి కాశీ, బొడ్డు వాసు సభ్యులు పాల్గొన్నారు



## చల్లపాలెంలో పోషణ్ మాహ్ కార్యక్రమం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30, జయ జయహే**

శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చల్లపాలెం బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ అసోసియేట్ వి.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సూపర్‌వైజర్ హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా తల్లులు, చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యత, సమతుల్య ఆహారం, వివిధ ఆహార వర్గాలు, పోషకాహార లోపాల నివారణపై అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు రోజువారీ ఆహారంలో వివిధ రకాల ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితో పాటు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



## కార్గో సర్వీస్ కై రూ 14లక్షలతో నూతన భవనం

### బస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనికీ చేసిన కలెక్టర్

**జంగారెడ్డిగూడెం(జయ జయహే)**

ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ను బుధవారం ఆకస్మికంగా సందర్శించి ప్రయాణీకులకు అందుతున్న త్రాగునీరు, టాయిలెట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణీకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణీకులతో ఆర్టీసీ సిబ్బంది ప్రవర్తన, మర్యాదగా మాట్లాడుతున్నారా లేదా, బస్సుల సమాచారం సక్రమంగా అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో ప్రధానమైన బస్టాండ్ లు ఉన్నాయని, ఆర్టీసీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ విధానం ద్వారా తెలుసుకుంటున్నదన్నారు. ఆ ప్రజాభిప్రాయంలో జంగారెడ్డిగూడెం బస్టాండ్ లో టాయిలెట్లపై ప్రయాణీకులు అసంతృప్తి వ్యక్తం చేసారని, వాటిని పరిశీలించేందుకు, ప్రయాణీకుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీ చేశానన్నారు. గృహ హింస, పోక్సో, మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణ, నిర్మూలనపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటుచేయటమైనది, సదరు నంబర్లను ప్రతీ బస్టాండ్, బస్సులో ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా రెడ్డి గణపవరం నకు బస్సు సర్వీసులు తక్కువగా ఉన్నాయని, సర్వీసులు ఏర్పాటుచేయాలని ప్రజలు కలెక్టర్ ని కోరారు. స్త్రీ శక్తీ పథకానికి మహిళల నుండి మంచి స్పందన వచ్చిందని, దీని కారణంగా బస్సులలో రద్దీ పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త బస్సులను మంజూరు చేసేలోగా, ప్రస్తుతం ఉన్న బస్సులనుండి కొత్త సర్వీసులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంక్వయిరీ కౌంటర్, త్రాగునీటి సౌకర్యం, రిజర్వేషన్ కౌంటర్, కార్గో, పార్సిల్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. సిసి కెమెరాలు గురించి ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్గో, పార్సెల్ కేంద్రం శిథిలావస్థలో ఉండడంతో వాటి వివరాలను ఆర్టీసీ ఆర్ఎం షబ్నమ్ ను ప్రశ్నించగా, కొత్త భవనం నిర్మాణానికి 14 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి పారిశుద్ధ్యం సక్రమంగా ఉండాలన్నారు.



## రూ.11.50 కోట్లతో రోడ్ల నిర్మాణం

### శంకుస్థాపన చేసిన గంటా

**ఆనందపురం, సెప్టెంబర్ 30: (జయ జయహే)**

నియోజకవర్గంలో రూ. 11.50 కోట్లతో నిర్మిస్తున్న రోడ్లకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆనందపురం మండల కార్యాలయ ప్రాంగణంలో బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో పట్టణాలకు ధీటుగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని తెలిపారు. రూ. 2.83 కోట్లతో బి.ఎన్.రోడ్డు నుంచి జీకే రోడ్డు వరకు, రూ.1.50 కోట్లతో వీపీ రోడ్డు నుంచి నారాయణ రాజు పేట వరకు, రూ. 1.31 కోట్లతో జాతీయ రహదారి నుంచి జీరుపేట వరకు, రూ. 1.02 కోట్లతో జీరుపేట నుంచి ఎస్టీ కాలనీ వరకు ప్రధాన రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. అలాగే కణమాం నుంచి బీడీ పాలెం వరకు, విజయనగరం శొంట్యాం రోడ్డు నుంచి పేకేరు వరకు, కుసులువాడ ఎస్సీ కాలనీ నుంచి కుసులువాడ వరకు, బీఎన్ రోడ్డు నుంచి బాకూరుపాలెం వరకు, మద్ది నుంచి తునిపాలెం వరకు, పొట్నూరు జెడ్పీ రోడ్డు నుంచి కుమరం వరకు, అలమండ నుంచి బోని వాటర్ వర్క్స్ వరకు రోడ్ల నిర్మాణానికి రూ.4.80 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దిష్ట గడువులోగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆనందపురం డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, సరగడ అప్పారావు, గాడు వెంకటప్పడు, బి.ఆర్.బి. నాయుడు, లొడగల వెంకట్రావు, కాళ్ల నగేష్ కుమార్, మహంతి శివాజీ, కె. రామానాయుడు, గండ్రెడ్డి సోమినాయుడు, ఎర్ర రాజు, బంకు రాజు తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# ప్రేమ పేరుతో పాశవికం

## గర్భవతిని హత్య చేసి ఇంటి ఆవరణలో పాతిపెట్టిన సహజీవన భాగస్వామి

## నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన దారుణం- జైపూర్‌లో సంచలనం

(ప్రతాప్)

రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో మానవత్వాన్ని కుదిపేసిన దారుణ ఘటన వెలుగుచూసింది. సహజీవనం చేస్తున్న గర్భవతి మహిళను హత్య చేసిన యువకుడు, ఆమె మృతదేహాన్ని తన అద్దె ఇంటి ఆవరణలో రహస్యంగా పాతిపెట్టిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. కొన్ని రోజుల పాటు ఈ ఘోర నేరాన్ని ఎవరూ గుర్తించకపోవడం, చివరకు ఇంటి యజమాని అప్రమత్తతతో విషయం బయటపడటం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

పోలీసుల కథనం ప్రకారం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కిరణ్ రావత్ మరియు ప్రవేశ్ కుమార్ గత రెండు నెలలుగా జైపూర్‌లోని బిందాయక ప్రాంతంలోని ప్రెస్టీజ్ గార్డెన్ కాలనీలో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. ఇంటి యజమానికి వీరిద్దరూ భార్యాభర్తలమని చెప్పి అక్కడ నివాసముంటున్నారు. కిరణ్ గర్భవతి కాగా, ఇద్దరూ ఉపాధి కోసం రాజస్థాన్‌కు వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.








సెప్టెంబర్ 23 ప్రాంతంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం ప్రవేశ్ కిరణ్‌ను గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో తేలింది. హత్య అనంతరం నేరాన్ని దాచిపెట్టేందుకు అత్యంత పథకం ప్రకారం ఇంటి ఆవరణలో గుంత తవ్వి మృతదేహాన్ని పాతిపెట్టాడు. అంతేకాకుండా దుర్వాసన బయటకు రాకుండా ఉండేందుకు మృతదేహంపై ఉప్పు కూడా చల్లినట్లు పోలీసులు వెల్లడించారు. ఆ తర్వాత ఇంటికి తాళం వేసి అక్కడి నుంచి పరారయ్యాడు.

ఘటన వెలుగులోకి వచ్చిన విధానం మరింత సంచలనంగా మారింది. నాలుగు రోజుల తర్వాత ఇంటిని తనిఖీ చేయడానికి వచ్చిన యజమాని ప్రాంగణంలో తాజాగా తవ్విన మట్టిని గమనించాడు. అనుమానం వచ్చి దగ్గరగా పరిశీలించగా మట్టిలో నుంచి మహిళ చేతి భాగం బయటకు కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు ఫోరెన్సిక్ బృందం సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఈ ఘటనపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ మార్గాలను విశ్లేషించి నిందితుడి కదలికలను గుర్తించారు. చివరకు ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో అతడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. విచారణలో మొదట తప్పుడు కథనం చెప్పేందుకు ప్రయత్నించినా, అనంతరం నేరానికి సంబంధించిన కీలక విషయాలు బయటపడ్డాయని అధికారులు తెలిపారు.

గర్భవతి మహిళ హత్యకు గురవడం, మృతదేహాన్ని ఇంటి ఆవరణలో పాతిపెట్టి ఆధారాలు చెరిపివేయాలన్న ప్రయత్నం చేయడం, ఘటన బయటపడే వరకు ఎవరూ అనుమానించకపోవడం ఈ కేసును మరింత భయానకంగా మార్చాయి. మహిళల భద్రత, సహజీవన సంబంధాల్లో ఉత్పన్నమవుతున్న వివాదాలు, మానసిక ఆవేశం ఎంతటి ఘోర పరిణామాలకు దారితీస్తాయో ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసింది. ప్రస్తుతం పోలీసులు కేసు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తూ, హత్య వెనుక ఉన్న పూర్తి కారణాలను వెలికితీసే పనిలో నిమగ్నమయ్యారు.

(మీడియా వార్తల ఆధారంగా)



## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

శ్రీకాళహస్తి , సెప్టెంబర్ 30, జయ జయహే

శ్రీకాళహస్తి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతి జిల్లా కాంగ్రెస్ నేతలు ఆందోళన చేపట్టారు. జిల్లా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతి కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తిరుపతి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బాలగురవం బాబు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం ప్రజాక్షేత్రంలో పోరాడే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ప్రజలకు అన్యాయం జరుగుతుంటే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సహచర ఎన్నికల అధికారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఎస్ఐఆర్‌ను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా లక్షలాది ఓట్ల తొలగింపునకు అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే ఎస్ఐఆర్‌ను నిలిపివేసి సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కాగా, ఎస్ఐఆర్‌కు సంబంధించి ఎన్నికల సంఘం సెప్టెంబర్ 26న తీసుకున్న నిర్ణయాల్లో నోటీసులు అందుకున్న, మ్యాపింగ్ కాని లేదా లాజికల్ డిస్క్రెపెన్సీలు ఉన్న వ్యక్తుల ఇళ్లకు బూత్ లెవల్ అధికారులు వెళ్లి పత్రాలు సేకరించి ఈసీఐనెట్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని పేర్కొంది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త నరసయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, కృష్ణమూర్తి, కార్యదర్శులు ఇళయరాజా, గోపి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనుగౌడ్, జిల్లా పరిపాలన కమిటీ చైర్మన్ రత్నం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ బైక్ యాత్రకు శ్రీకాళహస్తిలో ఘన స్వాగతం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30, జయ జయహే



శ్రీకాళహస్తి ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ బైక్ యాత్ర'కు శ్రీకాళహస్తిలో ఘన స్వాగతం లభించింది. తిరుపతి అలిపిరి నుంచి కాశీ (వారణాసి) వరకు సాగుతున్న యాత్రలో భాగంగా శ్రీకాళహస్తి ఏపీ సీడ్స్ వద్దకు చేరుకున్న యాత్ర బృందానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్వాగతం పలికారు.అనంతరం యాత్ర బృందాన్ని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి తీసుకెళ్లి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం యాత్రికులకు తీర్థప్రసాదాలు అందజేసి, ఆలయ ప్రాంగణంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొంటున్న యువతను సుధీర్ రెడ్డి సత్కరించి యాత్ర కొనసాగింపునకు వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రగతి, వికాసం, ఐక్యతను చాటిచెప్పేలా యువత చేపట్టిన ఈ యాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆశీస్సులతో యాత్రలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ సురక్షితమైన ప్రయాణం కలగాలని కోరుకున్నారు.

# కాంప్లెక్స్ రోడ్డు నిర్మాణానికి పరిశీలన



మాడుగుల సెప్టెంబర్ 30 జయ జయహే

పల్లె పండగ 3.0 లో భాగశీగా మాడుగుల గ్రామ పంచాయతీ పరిధిలోని జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ల మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ కు సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిధులు మంజూరు చేశారు.దీంతో బుధవారం అధికారులు కూటమి నాయకులు స్థల పరిశీలన జరిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎండిఓకే అప్పారావు, మండల ఏఈ శ్రీనివాస్, పట్టణ టిడిపి అధ్యక్షుడు పి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## రూ.25 లక్షలతో రైతుబజారు అభివృద్ధి

### నిడదవోలులో స్థలాన్ని పరిశీలించిన సీఈఓ మాధవీలత

నిడదవోలు జయ జయహే ప్రతినిధి:

నిడదవోలులోని మినీ రైతుబజారును రూ.25 లక్షలతో పూర్తిస్థాయి రైతుబజారుగా అభివృద్ధి చేయనున్నట్లు ఏపీ రైతుబజార్ల సీఈఓ కె. మాధవీలత తెలిపారు. బుధవారం ఆమె రైతుబజారు ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2016లో 24 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మినీ రైతుబజారును పట్టణ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ షెడ్లు, ప్రాంగణం, రహదారులు, కాంపౌండ్ వాల్ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అభివృద్ధి పనులకు గురువారం టెండర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.పరిశీలనలో తహసీల్దార్ నాయక్, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి హరిబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

నిడదవోలు జయ జయహే ప్రతినిధి:

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో నిడదవోలులోని ఎస్ఎఫ్ఎస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు దేశ భవిష్యత్తుపైనా తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఎగిల్ టీమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యమోహన్, నిడదవోలు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కుమార్, ఏబీవీపీ రాజమండ్రి విభాగ్ కన్వీనర్ ఆకుల సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్ ఎ.వి. రమణ

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం జయ జయహే ప్రతినిధి:

మాజీ కార్పొరేటర్, టి.నగర్ విశ్వేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఎ.వి. రమణ బీజేపీలో చేరారు. బుధవారం టి.నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ.. రమణ గతంలో కార్పొరేటర్‌గా, దేవస్థానం చైర్మన్‌గా ప్రజలకు సేవలందించారని తెలిపారు. ఆయన బీజేపీలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తోందని పేర్కొన్నారు.ఎ.వి. రమణ మాట్లాడుతూ.. ఎలాంటి పదవుల ఆశతో బీజేపీలో చేరలేదని, ప్రధాని మోదీ నాయకత్వం తనను ఆకర్షించిందని తెలిపారు. ప్రజాసేవలో నీతి, నిజాయితీకి ప్రాధాన్యం ఇస్తూ పార్టీ కోసం పనిచేస్తానన్నారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, కురగంటి సతీష్, రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, కాలెపు సత్య సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దకన్నలి హైస్కూల్ చైర్మన్‌గా ఓంకార్ ఏకగ్రీవ ఎన్నిక

తొట్టంబేడు, సెప్టెంబర్ 30, జయ జయహే



తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా చిన్నసింగమల గ్రామానికి చెందిన సురకాని ఓంకార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో ఓంకార్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.అనంతరం నూతన చైర్మన్‌గా ఓంకార్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలోని మరుగుదొడ్ల పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, మధ్యాహ్న భోజనం నాణ్యత, ఉపాధ్యాయుల స్పందన తదితర అంశాలపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఓంకార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా ఎన్నుకున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పెద్దకన్నలి ఉన్నత పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేసి, పాఠశాలకు మరింత మెరుగైన వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com